E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 29-05-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:146 || పేజీలు–6
www.ekaburu.com



నేడు.. రేపు వడగాలులు

02

02

కుర్చీ దిగిపోయిన సిద్ధరామయ్య

అధిష్ఠానం సూచనలతో రాజీనామా

జాతీయ రాజకీయాలకు వెళ్లబోనని ప్రకటన

తదుపరి సీఎంగా డీకే శివకుమార్‌కు అవకాశాలు

ఈ-కబురు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. కొందరు మంత్రులు, అభిమానులు వద్దన్నా వెనకడుగు వేయలేదు.

నీతి నిజాయతీకి ఎన్టీఆర్ చిరునామా

- ఇందిరమ్మ, రామారావు స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రజాపాలన
- ఆయన విగ్రహావిష్కరణ జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకం
- 2034 వరకు ప్రజాప్రభుత్వానిదే అధికారం
- అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

ఈకబురు, హైదరాబాద్ , కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా జాతి గర్వించదగ్గ నాయకుడు నందమూరి తారక రామారావు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఒక సీఎంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం జీవితకాలం గుర్తుండిపోయే జ్ఞాపకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయంలో ఇందిరమ్మ, ఎన్టీఆర్ స్ఫూర్తి కనిపిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో మహానటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా చేపట్టిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. తొలుత పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ కుమారులు రామకృష్ణ, మోహనకృష్ణ ఇతర కుటుంబ సభ్యులతో కలిసి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. ''తెలుగుజాతి అభిమానంతో అన్నా అని పిలుచుకునే ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషం. దేశచరిత్ర నుంచి ఎవరు స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతిరత్నాలను తలచుకోవాలి. భారత రాజ్యాంగాన్ని రచించి పేదలకు మేలు చేసిన డాక్టర్ అంబేద్కర్‌ను మొదట స్మరించుకోవాలి. 1971లో పాకిస్థాన్ భారత్ యుద్ధంలో తెగువ చూపి.. పాక్ నుంచి బంగ్లాదేశ్‌ను విడదీసి.. అమెరికాను కల్పించుకోవద్దని హెచ్చరిక జారీ చేసిన ఉక్కు మహిళ.. భూసంస్కరణలు తెచ్చి.. పేదలకు పంచి హక్కులు కల్పించిన మహానేత ఇందిరాగాంధీని తలచుకోవాలి. మూడోతరంలో నీతి, నిజాయతీ, ఉక్కు సంకల్పం కలిగిన నాయకుడు ఎన్టీఆర్‌ను స్మరించుకోవాలి. ఎన్టీఆర్ విగ్రహాన్ని కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఆవిష్కరించడం ఏమిటని కొందరు విమర్శలు చేస్తున్నారు.. వారికిదే సమాధానం. ఆయన కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా జాతి గర్వించదగ్గ నాయకుడు. ఇది కేవలం విగ్రహం మాత్రమే కాదు.. రాజకీయాలకు అతీతమైన స్ఫూర్తి. బలహీనవర్గాల నాయకులు పాలకులుగా ఎదగడం వెనుక ఆయన సహకారం ఎంతో ఉంది. తెలంగాణకు తుమ్మల, మండవ, కడియం, మోత్కుపల్లి, జానారెడ్డిలాంటి ఎంతోమంది నాయకులను అందించారు. భారాస అధినేత కేసీఆర్‌ను గుర్తించి నాయకుడిని చేసింది, రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్ కాదా? ఎన్టీఆర్ పేరు పెట్టుకున్న వాళ్లు కూడా ఆయన విగ్రహం పెట్టడాన్ని విమర్శిస్తున్నారు.

మిగతా 2లో

06

భారత మహిళల శుభారంభం

.. తొలి టీ20లో ఇంగ్లాండ్‌పై ఘన విజయం

ఇంగ్లాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత మహిళలు శుభారంభం చేశారు. చెమ్స్‌ఫర్డ్ వేదికగా జరిగిన పోరులో ఆ జట్టును ఇండియన్ టీమ్ 38 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. జెమీమా రోడ్రిగ్స్(69: 40 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్), యాస్తికా భాటియా (54: 40 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగడంతో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది.

ఆ మాటకు పొంగులేటి కట్టుబడి ఉండాలి: కేటీఆర్

03

భారత్ ప్రగతి అద్భుతం

ప్రధాని మోదీ రాకకోసం ఎదురు చూస్తున్నా ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ వెల్లడి

02

రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు

- టీజీఐఐసీ ఈ-వేలంలో చరిత్ర తిరగరాసిన హైదరాబాద్ రియాల్టీ
- 6.29 ఎకరాల ప్లాట్ ఏకంగా రూ.1,490.73 కోట్లకు విక్రయం

02



ఈకబురు, , హైదరాబాద్: మహా నగరంలో భూమి బంగారమైంది. నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో ఎకరం భూమి రూ.100 కోట్లు అంటే.. దేశమే ఆశ్చర్యపోయింది. గతేడాది ఎకరా రూ.177 కోట్లతో రికార్డులను బద్దలుకొట్టింది. ఇప్పుడు ఏకంగా చుక్కలను తాకేలా రూ.200 కోట్ల మార్కును దాటి ఆల్‌టైమ్ రికార్డు ధర పలికింది. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) గురువారం నిర్వహించిన ఈవేలంలో మునుపెన్నడూ లేనివిధంగా ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికి పాత రికార్డులన్నింటినీ తిరగరాసింది.

ఎన్టీఆర్‌కు భారతరత్న తెలుగువారి ఆకాంక్ష

- తెలుగుజాతి గుండెల్లో శాశ్వతంగా ఎన్టీఆర్
- లోకేష్ ప్రతిపాదించిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు మనమే ప్రారంభిద్దాం
- మహానాడు సభలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడులో ఏకగ్రీవంగా తీర్మానం



ఈ-కబురు, ఎన్టీఆర్ భవన్ :

తెలుగుజాతికి వెలుగై నిలిచిన స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని గురువారం మహానాడు రెండో రోజున ఎన్టీఆర్ కు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

మిగతా 2లో

అభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తున్నాం

- ఆ అభివృద్ధి ప్రణాళిక విప్లవత్మక మార్పు తెస్తుంది. తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉండాలి
- కార్మికులకు మినిమమ్ వేజెస్ ఫిక్స్ చేశామని చెప్పి వారికి ముఖ్యమంత్రి తీరని అన్యాయం చేస్తున్నారు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఉమ్మడి ఆదిలాబాద్ కు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ ఆయన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ పార్టీలో చేరిక

ఈకబురు,,హైదరాబాద్ : సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని...అది తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తో పాటు ఆయన అనుచరులు టీఆర్ఎస్‌లో చేరారు.

మిగతా 3లో

03

రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులకు మద్దతివ్వడం సరికాదు

పశ్చిమాసియాలో మళ్లీ సెగలు

03

రైతన్నలూ అధైర్యపడొద్దు... ప్రతి గింజనూ కొంటాం

- రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ చేపడతాం
- వచ్చే సీజన్ నాటికి హమాలీలు, గిడ్డంగుల కొరత లేకుండా చర్యలు:
- ధాన్యం సేకరణపై కలెక్టర్లు, మిల్లర్లతో సమీక్ష

02

కుర్చీ దిగిపోయిన సిద్ధరామయ్య

ఈకబురు, బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. కొందరు మంత్రులు, అభిమానులు వద్దన్నా వెనక డుగు వేయలేదు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనతో గురువారం మంత్రివర్గ సహచరులను అల్పాహార సమావేశానికి ఆహ్వానించి తాను రాజీనామా చే స్తున్నట్లు నిర్ణయం ప్రకటించారు. మధ్యాహ్నం 2:45 గంటలకు లోక్‌భవన్‌కు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రివర్గ సహచరులతో తరలి వెళ్లి గవర్నర్ ప్రత్యేకకార్యదర్శి ప్రభుశంకర్‌కు రా జీనామాపత్రం సమర్పించారు. మధ్యప్రదేశ్‌కు వెళ్లిన గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ గురువారం రాత్రి బెంగళూరుకు తిరిగివస్తారని లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. అనంతరం విలేకరుల సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి.. వీడ్కోలు ప్రసంగం చేశారు. ఆపై.. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసేందుకు సాయంత్రం ప్రత్యేకవిమానంలో దిల్లీకి బయలుదేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్‌సింగ్, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వేర్వేరుగా దిల్లీకి పయనమయ్యారు. తదుపరి ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌కే అవ కాశాలు కనిపిస్తున్నాయి.

అధిష్ఠానం సూచనతో ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసినట్లు సిద్ధరామయ్య ప్రక టించారు. '21 ఏళ్ల క్రితం కాంగ్రెస్‌లో చేరిన నాకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పార్టీ ఇచ్చిన సహకారం మరువలేనిది. విపక్ష నేతగా, రెండుసార్లు ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పని చేశాను. అధిష్ఠానం రాజ్యసభకు రమ్మని ఆహ్వా నించినా సున్నితంగా తిరస్కరించా. చివరిశ్వాస వరకు మతఛాందస శక్తులపై పోరాడుతూ రాజ కీయాల్లోనే కొనసాగుతాను' అని ప్రకటించారు. తదుపరి సీఎం ఎవరని ప్రశ్నించగా.. అధిష్ఠానం సూచన, సీఎల్పీ ఎన్నుకునే వ్యక్తే ముఖ్యమంత్రి అవుతారన్నారు. మంత్రివర్గంతో అల్పాహార సమావేశం ప్రారంభంలోనే డీకే శివకుమార్.. సి ద్ధరామయ్యకు పాదాభివందనం చేసి, ఆత్మీయం గా ఆలింగనం చేసుకున్నారు. దీంతో తదుపరి నాయకుడు డీకే అన్న సంకేతాలు స్పష్టమయ్యా యి. ఈ సమావేశంలోనే అధిష్ఠానం.. డీకేను ముఖ్యమంత్రిగా ఉండాలని సూచించింది. కొత్త నాయకుడికి అందరూ సహకరించాలని, పార్టీలో విభేదాలు పెరిగితే భాజపా అవకాశంగా తీసు కుంటుందని ముఖ్యమంత్రి సూచనప్రాయంగా చెప్పినట్లు సమాచారం.

విలువలతో పనిచేశాను

'రాజ్యాంగాన్ని ఓ మతంగా భావించే నాయ కుడిగా విలువలు, సిద్ధాంతాలపై ఎన్నడూ రాజీ పడలేదు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 90% నెరవేర్చాను. ప్రధాని మోదీ నుంచి విపక్ష నేతలంతా గ్యారంటీలతో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీస్తుందని అంచనా వేసినా అది వాస్తవం కాదని నిరూపించాం. దేశ జీడీపీ కంటే మెరుగైన జీఎస్‌డీపీని నమోదుచేశాం' అని సిద్ధరామయ్య చెప్పారు.

డీకే ముందడుగు

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా తో డీకే శివకుమార్ కల దాదాపు సాకారమైనట్లే కనిపిస్తోంది. సిద్ధరామయ్య రాజీనామా ప్రకటన చేయగానే డీకే నివాసం వద్దకు మంత్రిపదవుల ఆశావహులు దండుగా తరలివెళ్లారు. ప్రమాణస్వీ కారానికి ముహూర్తం చూడాలని డీకే శివకుమార్ తన వ్యక్తిగత పూజారిని కోరారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాతే..

కన్నడనాట నాయకత్వ మార్పుపై వస్తున్న వదం తులను అదుపుచేయలేదని కాంగ్రెస్ అధిష్ఠానంపై తీవ్ర విమర్శలొచ్చాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత అధిష్ఠానం వేగంగా పావులు కదిపింది. ఒక్క రోజులోనే వ్యవహారాన్ని చక్కబె ట్టింది. ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్న సిద్ధరా మయ్య.. తనను దిగిపొమ్మని అధిష్ఠానం అంత సులువుగా చెప్పదనుకున్నారు. కానీ రాజీనామా చేసి రాజ్యసభకు రావాలని రాహుల్‌గాంధీ ఒకే మాట చెప్పడంతో ముఖ్యమంత్రి మారుమాట్లా డలేదు. అహింద, దళిత సీఎం కార్డులు ప్రయో గించాలనుకున్న డాక్టర్ జి.పరమేశ్వర్, హెచ్. సి.మహదేవప్ప, సతీశ్ జార్ఖిహొళి తదితరులు కూడా నోరు మెదపలేకపోయారు.

భారత్ ప్రగతి అద్భుతం

ఈకబురు, కాన్‌బెర్రా: భారత్ సాధిస్తున్న ఆర్థిక ప్రగతి ఇండో-పసిఫిక్ ప్రాంతానికి అద్భుతమైన అవకాశమని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంటోనీ ఆల్బనీస్ పేర్కొన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీకి మరోసారి ఆతిథ్యం ఇచ్చేందుకు తాను ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. కాన్‌బెర్రాలోని పా ర్లమెంట్‌లో గురువారం ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన భారత్, త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు ఎద గనుందన్నారు.

2022లో కుదిరిన ఆర్థిక సహకారం, వాణిజ్య ఒప్పందంతో రెండు దేశాల వాణి జ్య సంబంధాలు గణనీయంగా పెరిగా యన్నారు. 1991లో పర్యాటకుడిగా భారత్ వెళ్లిన తాను, ప్రధానిగా రెండు పర్యాయాలు భారత్ సందర్శిం చినట్లు చెప్పారు. భారత్‌ను దగ్గర్నుంచి పరిశీలిం చాలనుకునే వారిక బస్సు, రైలు ప్రయాణం ఉత్త మమని సలహాఇచ్చారు. 'అదొక అద్భుతమైన అనుభవం. ప్రజల ఆప్యాయత చూసేందుకు చక్కని అవకాశం'అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ చివరిసారిగా 2023లో ఆస్ట్రేలియాలో పర్యటించారు.

నీతి నిజాయతీకి ఎన్టీఆర్ చిరునామా

సన్నబియ్యం అందించడం వెనుక ఎన్టీఆర్ స్ఫూర్తి.. రాష్ట్రవ్యాప్తంగా పేదలు, బలహీనవర్గాలకు సన్నబి య్యం అందిస్తున్న స్ఫూర్తి వెనుక ఎన్టీఆర్ అందించిన రూ.2 కిలో బియ్యం పథకం ఉంది. ఆడబిడ్డలకు సంక్షేమ పథకాలు అందించిన, పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి పేదలు ఆత్మగౌరవంతో బతికే అవకాశం కల్పించిన ఘనత ఆయనకు దక్కుతుంది. నాడు రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో ఆడబిడ్డలకు రి జర్వేషన్ కల్పిస్తే.. అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన ఆశయాలకు అనుగుణంగా నిరుపేదలకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నాం. మా ప్రభుత్వం ఏర్ప డ్డాక తొలిఏడాదిలోనే 65 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. భవిష్యత్తులోనూ మీ సహకారం ఇలాగే కొనసాగితే 2034 వరకు ప్రజాప్రభుత్వానిదే అధికారం. సైబరా బాద్‌ను చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళితే.. ఇప్పుడు 50,000 ఎకరాల్లో నిర్మించను న్న భారత్ ఫ్యూచర్ సిటీకి ప్రపంచ దిగ్గజ కంపెనీలను తీసుకొస్తాం. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడు తూ.. కాంగ్రెస్ పార్టీ మాటకు కట్టుబడి ఉంటుందని చెప్పడానికి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఒక తార్కాణ మని పేర్కొన్నారు. ఆయన మాదిరిగానే సీఎం రేవం త్‌రెడ్డి పేదల పక్షపాతిగా పాలన సాగిస్తున్నారన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇం దిరమ్మ, ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన అందిస్తున్నారన్నారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ

.. ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించారన్నారు. జూబ్లీహిల్స్ శాసన సభ్యుడు నవీన్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కా ర్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యా దవ్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, జైవీర్,

కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేశ్, వైస్ ఛైర్మన్ పరుచూరి మురళీకృష్ణ, నటుడు మంచు మనోజ్, సినీ దర్శకుడు బోయపాటి శ్రీను పాల్గొన్నారు. జీవనశక్తి చిట్‌ఫండ్స్ అధినేత కాట్రగడ్డ రమేశ్ ఎన్టీఆర్ విగ్రహా న్ని అందించగా.. కమ్మ సంఘం నేతలు కాసరనేని కిశోర్, కొల్లి లక్ష్మణరావు, వేములపల్లి విజయకుమా ర్, మన్నె లక్ష్మణ్‌బాబు, బలుసు వినయ్, చలసాని అరుణ్ ప్రసాద్, అమీర్‌పేట్ కమ్మ సంఘం అధ్యక్షుడు సీవీరావు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు

పోటీ పడిన సంస్థలు

రాయదుర్గం గ్రోత్ కారిడార్‌లోని అత్యంత కీలక మైన 83/1 సర్వే నంబరులోని ప్లాట్ నంబరు 1ఏ, 1/ఎఫ్ పరిధిలోని 6.29 ఎకరాల మల్టీయూజ్ (బ హుళ వినియోగం) భూమికి టీజీఐఐసీ గురువారం ఈవేలం నిర్వహించింది. ఎకరాకు రూ.139 కోట్ల రిజర్వు ధరను నిర్ణయించగా.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ డెవలపర్లు, కార్పొరేట్ సంస్థలు భూమిని దక్కించుకోవడానికి పోటీపడ్డాయి. 'ఎంఎస్‌టీసీ' పోర్టల్ ద్వారా పారదర్శకంగా సాగిన ఈ డిజిటల్ వేలంలో ఊహించని రీతిలో బిడ్లు దాఖలయ్యాయి. చివరకు రిజర్వు ధర కంటే రికార్డు స్థాయిలో ఎక్కువ పలికి, మొత్తం రూ.1,490.73 కోట్ల భారీ ధరతో ఈ ప్లాట్ అమ్ముడుపోయింది. హైదరాబాద్‌కి చెందిన గౌర వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థిరాస్తి సంస్థ ఈ భూమిని దక్కించుకుంది. జేఎల్ఎల్ సంస్థ ఈ లా వాదేవీకి ప్రత్యేక సలహాదారుగా వ్యవహరించింది. సరికొత్త మౌలిక వసతులు, అప్రతిహతంగా సాగు తున్న ఐటీ, వాణిజ్యరంగాల విస్తరణతో హైదరాబా ద్.. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఈ 'ల్యాండ్ మార్క్' వేలం మరోసారి స్పష్టం చేసింది. ఇదే సర్వే నంబరు ప్లాట్ నంబరు పీ4లో 5.09 ఎకరాలకు జూన్ ఒకటిన వేలం జరగనుంది.

ఏటికేడు ఆకాశమే హద్దు!

హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల మధ్య ఉండటంతో ఈ భూమికి మార్కెట్లో ఊహించని రీతిలో డిమాండ్ ఏర్పడింది. 2017లో రాయదుర్గం ప్రాంతంలో 2.84 ఎకరాల భూమికి ఎకరాకు రూ.42.59 కోట్లు పలికింది. 2022 నాటికి కోకాపేట నియోపొ లిస్ వేలంలో 3.60 ఎకరాల పరిధిలో ఎకరా ధర రూ.100.75 కోట్లకు చేరి అప్పట్లో రికార్డును సృ ష్టించింది. 2025 అక్టోబరులో రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో జరిగిన వేలంలో ఎకరా ధర రూ.177 కోట్లు పలికింది. ఇప్పుడు ఆ రికార్డులన్నీ కనుమరుగయ్యే లా రాయదుర్గంలోని పాన్‌మక్తాలో జరిగిన తాజా వేలంలో ఎకరా ధర అసాధారణ రీతిలో రూ.237 కోట్లు పలికి సరికొత్త చరిత్ర లిఖించింది. రికార్డు ధరకు ప్లాట్ అమ్ముడవడంపై టీజీఐఐసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంక స్పందిస్తూ.. 'రాయదు ర్గం ఈవేలానికి వచ్చిన స్పందన అసాధారణం. హైద రాబాద్‌తో పాటు తెలంగాణపై పెట్టుబడిదారులకు, డెవలపర్లకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం' అని పేర్కొన్నారు.



రావిర్యాలలో చ.గజం రూ.83,500

హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఈ-వేలం

మహానగరం 'క్యూర్' పరిధిలో భారీ వెంచర్లు చేపట్ట డానికి అనువుగా ఉన్న భూములకు డిమాండ్ పెరు గుతోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ ప్రాంగణంలో విమానాశ్రయానికి సమీపంలోని రావిర్యాలలో భూములకు రాష్ట్ర హౌ సింగ్‌బోర్డు గురువారం ఈవేలం నిర్వహించింది. మొత్తం 4 భూములకు నిర్వహించిన వేలంపాటలో చదరపు గజం గరిష్ఠంగా రూ.83,500కు అమ్ముడు పోయినట్లు హౌసింగ్‌బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతం తెలిపారు. 1,000 13,500 చ.గజాల విస్తీర్ణంలోని నాలుగు ల్యాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలంద్వా రా సుమారు రూ.140 కోట్ల ఆదాయం సమకూరిన ట్లు వెల్లడించారు. ఈ భూములను దక్కించుకోవడా నికి 17 సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో 1,113 చ.గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు ఆసక్తి చూపారు. రూ.26,000 కనీస ధరను నిర్ణయించగా.. పోటీపడుతూ గరిష్ఠంగా రూ.83,500కి చేరింది. అదే ప్రాంతంలోని సుమారు 6000 చ.గజాల విస్తీర్ణంలోని భూమి వేలంలో చ.గజం రూ.62,500 ధరకు అమ్ముడైంది.

ఎన్టీఆర్‌కు భారత రత్న తెలుగు వారి ఆకాంక్ష

ఎన్టీఆర్ ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు

'తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి...సినీ జీవితంతో పాటు రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఉమ్మడి ఏపీ ముఖ్యమం త్రిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దేనికీ తిరుగు ఉండదు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరు. ఆయన మొదట సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరి ఆ తర్వాత ఆయన సినిమాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ము ఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్థాపించిన ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటు లో ముఖ్య పాత్ర పోషించింది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్‌ది చిరస్మరణీయ స్థానం

'"ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం, యువతకు దిక్సూచి అయ్యింది. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అనే నినాదాన్ని శాశ్వత విధానంగా ఎన్టీఆర్ మార్చారు. తెలుగుదేశం జెండా ఆడబిడ్డలకు అండ, రైతన్నలకు భరోసా, యువతకు విశ్వాసం. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పిం

చారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు. భవిష్య త్‌లో పార్టీకి సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్ కార్యాచరణ చేపడుతున్నాం. జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు లోకేష్ మహానాడు తొలిరోజున ప్రతిపాదిం చిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దాం. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

నేడు.. రేపు వడగాలులు

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్ర, శనివా రాల్లో పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావ రణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొ త్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో.. శనివారం వీటితోపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ వడగాలులు నమో దవుతాయని పేర్కొంది. శుక్ర, శనివారాల్లో ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, (గంటకు 4050 కి.మీ.) కూడిన వర్షాలు కురుస్తాయ ని సూచించింది. వచ్చే నెల మూడో తేదీ వరకు పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. మరోవైపు నైరుతి రుతుపవనాల్లో కొద్దిగా కదలికలు ప్రారంభమయ్యాయి. బంగాళా ఖాతంలో ఎగువకు రుతుపవనాలు కదిలేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు ఐఎండీ ఓ ప్రక టనలో తెలిపింది. గురువారం రాష్ట్రంలో ఎండలు దం చికొట్టాయి. బుధవారం వాతావరణం కాస్త చల్లగా అనిపించినా.. తెల్లారేసరికి అంతా మారిపోయింది. 12 జిల్లాల్లో 46 డిగ్రీలు.. ఆపైనే ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలో 46.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. పె ద్దపల్లి జిల్లా ముత్తారం 46.3, వరంగల్ జిల్లా సంగెం 46.3, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం 46.2, ఖమ్మం జిల్లా ఏన్కూరు 46.2, కుమురం భీం జిల్లా బెజ్జూరు 46.2, నిజామాబాద్ జిల్లా బోధన్ 46.2, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ 46.1, జగిత్యాల జిల్లా యెండపల్లి 46.1, మహబూబాబాద్ జిల్లా గార్ల 46.1, సూర్యాపేట జిల్లా నాగారం 46.1, నిర్మల్ జిల్లా కేంద్రంలో (నిర్మల్ గ్రామీణ మండలం) 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రైతన్నలూ అధైర్యపడొద్దు... ప్రతి గింజనూ కొంటాం

ఈకబురు, భువనగిరి, పెద్దపల్లి, హనుమకొండ కలెక్టరేట్: రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని, తడిసిన వడ్లను సైతం మద్దతు ధరకు సత్వరమే సేకరిస్తున్నామని రాష్ట్ర పౌర సరఫ రాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. రైతులను రెచ్చగొట్టడానికే ప్రతిపక్షాలు పర్యటనల తో రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. వారి మాటలను నమ్మొద్దని అన్నదాతలకు విన్నవించా రు. ఆయన గురువారం మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పౌరసరఫరాల సంస్థ కమి షనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి యాదాద్రి, పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో పర్యటించారు.

యాదగిరిగుట్ట మండలం వంగపల్లి, పెద్దపల్లి జిల్లా పెద్దకల్వలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీ లించి... అన్నదాతలతోనూ మాట్లాడి వడ్ల కొనుగోలు తీరుపై ఆరా తీశారు. తర్వాత యాదాద్రిభువనగిరి, పెద్దపల్లి, హనుమకొండ కలెక్టరేట్‌లలో ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ధాన్యం, మక్కల కొనుగోలు ప్రక్రియపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కు మార్, పౌరసరఫరాల సంస్థ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి అత్యవసర సమీక్ష నిర్వహించారు.

ఆయా సందర్భాలలో మంత్రి ఉత్తమ్ మాట్లాడు తూ... "రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,576 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 58 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం. ఇప్పటికే 8.5 లక్షల మంది రైతులకు రూ.10,500 కోట్లు చెల్లించాం. మరో 18 లక్షల టన్నులను సేకరించాల్సి ఉంది. ఇందులో 9వేల టన్నుల ధాన్యం తడిసింది. ధాన్యం ఎలాంటి స్థితిలో ఉన్నా మద్దతు ధరకే కొంటాం. రైతులు అధైర్యపడొ ద్దు. రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదు. 24 కోట్ల సంచులను సిద్ధంగా ఉంచి... అవసరమైన ప్రాంతా లకు తరలిస్తున్నాం. భారీగా పెరిగిన దిగుబడితోపా టు హమాలీల కొరత, నిల్వకు సరిపడా గిడ్డంగులు లేకపోవడంతో సేకరణలో కొంత జాప్యం జరిగింది. రాబోయే సీజన్లలో ఈ ఇబ్బందులన్నీ అధిగమించేం దుకు సమగ్ర కార్యాచరణతో చర్యలు తీసుకుంటాం. వాతావరణ శాఖ జూన్ 4వ తేదీ తర్వాత వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించిన నేపథ్యం లో కొనుగోళ్లు వేగంగా ముగించాలని అన్ని జిల్లాల యంత్రాంగాన్ని ఆదేశించాం. రానున్న వారం రోజు లపాటు ఈ క్రతువును వేగంగా పూర్తి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. ఇతర పనులన్నీ పక్కకు పెట్టి ధాన్యం సేకరణపైనే దృష్టి పెట్టాలి. ఎమ్మెల్యేలూ తమ నియోజకవర్గాల్లోనే ఉంటూ జిల్లా యంత్రాంగానికి సహకరించాలి. కేంద్రాల నుంచి మిల్లులు, గిడ్డంగు లకు ధాన్యం రవాణా చేసేందుకు ఆయా జిల్లాలో అవసరమైతే లారీలు, డీసీఎంలు, ట్రాక్టర్లను అద్దెకు తీసుకోవాలి. జిల్లాల వారీగా గోదాముల కేటాయిం పుల్లో సమన్వయంతో వ్యవహరించాలి. అవసరమైతే ప్రైవేటు గోదాములను వినియోగించుకోండి" అని సూచించారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు: శ్రీధర్‌బాబు

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... "తరుగు పేరిట ఎక్కడైనా రైతుల ధాన్యాన్ని ఎక్కువగా తీస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటాం. వారి నుంచి ఆ మొత్తాన్ని తిరిగి వసూలు చేస్తాం. పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో తక్ష ణమే కొనుగోళ్లు పూర్తి చేయాలి" అని అధికారులను ఆదేశించారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు: పొంగులేటి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... "ప్రతిపక్ష నాయకులు కల్లాల వెంట తిరిగి కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. రైతులు వారి మాటల్ని నమ్మొ ద్దు. బస్సు యాత్ర చేస్తున్న భాజపా నాయకులు దిల్లీ యాత్ర చేపట్టి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం నుంచి సాయం తీసుకొస్తే బాగుంటుంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలి. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే మిల్లర్లపై సీరియ స్‌గా వ్యవహరించాలి. రైతులకు బేడీలు వేయించి నడిరోడ్డుపై తిప్పిన భారాస నాయకులకు మద్దతు ధర గురించి అడిగే నైతిక హక్కు లేదు. ప్రతిపక్ష నాయకు లకు ఇప్పుడున్న ఎమ్మెల్యే స్థానాలు కూడా భవిష్యత్తులో దక్కకుండా చూడాలి" అని రైతులను కోరారు.

యాదగిరిగుట్టలో హెలికాప్టర్ నుంచి దిగిన మంత్రులు నేరుగా వంగపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శిం చారు. అనంతరం రామాజీపేటలో అద్దెకు తీసుకున్న గోదాములను పరిశీలించారు. యాదాద్రి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ అనురాగ్ జయంతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రులకు వివరిం చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌లు బీర్ల అయిల య్య, వేముల వీరేశం, ఎంపీ చామల కిరణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్ పాల్గొన్నారు.

పెద్దపల్లి సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్ విజయ రమణారావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు, ఎమ్మెల్సీ బానుప్రసాదరావు, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు శ్రీహర్ష, రా హుల్‌శర్మ, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు. హనుమకొండలో నిర్వహించిన సమీక్ష సందర్భం గా... రైతులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా నిలుస్తుం దని, ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని తెలియజేస్తూ ప్రభుత్వం రూపొందించిన 'రైతులారా ఆందోళన చెందకండి' అనే గోడ పత్రికలను మంత్రులు ఆవిష్కు రించారు. ఉమ్మడి వరంగల్‌లోని జిల్లాల కలెక్టర్లు తమ జిల్లాల్లో ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా, చెల్లింపుల ప్రక్రియలపై వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.16,479 కోట్ల భారం మోపిన కేంద్రం

"భాజపా వాళ్లని చూస్తే నవ్వొస్తోంది. వారి పర్యటన లు, విమర్శలు విడ్డూరంగా ఉన్నాయి. ఇలాంటి రాజ కీయాలు చేయడం సరికాదు. గత పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలో తెలంగాణలో మాదిరి దేశంలో ఎక్కడా పంట పండలేదు. కొనుగోళ్లూ ఇక్కడ జరి గినట్లు ఎక్కడా జరగలేదు. తెలంగాణ నుంచి ఈ సీజన్‌లో 52 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఆ లక్ష్యాన్ని మేం ఇప్పటికే దాటేశాం. సీజన్ ముగిసే నాటికి కొనుగోళ్లు 75 లక్షల టన్నులకు చేరే అవకాశముంది. అంటే 23 లక్షల టన్నుల అదనపు ధాన్యాన్ని మద్దతు ధరతో కొనడానికి రాష్ట్ర ప్రభుత్వమే రూ.16,479 కోట్లను చె ల్లించనుంది. ఈ మేరకు తెలంగాణపై కేంద్రం భారం మోపింది" అని మంత్రి ఉత్తమ్ వివరించారు.

హఫీజ్ పేట్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు

బక్రీద్ పండుగ సందర్భంగా హఫీజ్ పేట్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

దర్గా హజ్రత్ సలార్ ఈ హోలియాలో ప్రత్యేక ప్రార్థనలు

ఈకబురు, శేరిలింగంపల్లి : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్ పేట్ లో ముస్లీంలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా హఫీజ్ పేట్ లోని నమాజ ఈదుల్ ఆజహా ఈద్గా దర్గా షరీఫ్ హజ్రత్ సలార్ ఈ హౌలియాకు ముస్లీంలు భారీ సంఖ్యలో చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ముతవల్లి సజీదా నషీన్ సుల్తాన్ ఆహ్సాన్ ఉద్ దౌలా ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను, దాని విశిష్టతను వివరించారు. పవిత్ర ఖురాన్ బోధనలను ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతియుతంగా జీవించాలని సూచించారు. ప్రార్థనల అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐకమత్యం, సుఖసంతోషాలు నెలకొనాలని అల్లాహ్ ను ప్రార్థించినట్లు ముస్లీం సోదరులు తెలిపారు. హైదరాబాద్ నగరం హిందు, ముస్లీంల ఐకమత్యానికి ప్రతీక అని, పండులను అందరూ కలిసి ఉత్సాహంగా నిర్వహించుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, స్థానిక నాయకులు హాజరై ముస్లీంలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తున్నాం

ఈకబురు,హైదరాబాద్ :
సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని...అది తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తో పాటు ఆయన అనుచరులు టీఆర్ఎస్ లో చేరారు. గురువారం బంజరాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో వారికి కండువాలు కప్పి టీఆర్ఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న బోడ జనార్దన్ చేరికతో టీఆర్ఎస్ కు మరింత బలం చేకూరిందన్నారు. చిన్న వయసులోనే కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ ఛైర్మన్ గా పనిచేసిన జనార్ధన్.. సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఆయన హోదాకు తగిన విధంగా పార్టీలో ప్రాధాన్యం ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి, ఆర్టీసీ కార్మికులకు అన్యాయం చేస్తూ కర్కషంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

సబ్బండ వర్గాల అభివృద్ధి ప్రణాళిక

తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడి సృష్టించేందుకు ఏర్పడిందే తెలంగాణ రక్షణ సేన అని కవిత అన్నారు. సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళికను తయారు చేస్తున్నామని... త్వరలోనే ఆ ప్రణాళికను ప్రకటిస్తామని చెప్పారు. ఇందుకోసం చాలా సీరియస్ గా కసరత్తు చేస్తున్నామన్నారు. తాము తీసుకురాబోయే ప్రణాళిక తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని కవిత చెప్పారు. తమ పార్టీ సమసమాజ స్థాపన కోసం ఏర్పడిందని... తాము కచ్చితంగా తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారుతామన్నారు. ప్రశ్నించటం, పోరాటడటం, పరిష్కరించటం అనే విధానంతో తాము ముందుకు వెళ్తున్నామని కవిత చెప్పారు. కొంతమంది ప్రశ్నిస్తారు. మరికొంతమంది పోరాటం చేస్తారు. కానీ తమ పార్టీ ప్రశ్నించి, పోరాడి, పరిష్కరించే వరకు సమస్యను వదిలిపెట్టదన్నారు. జనం బాట కార్యక్రమం లో మనం ప్రస్తావించిన సమస్యల్లో 25 సమస్యలకు పరిష్కారం లభించిదని గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ ను మనం ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రివ్యూ చేశారు. ఉద్యమాలు చేయకండి మేము పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. నల్గొండలో 35 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి పనులను జనంబాటలో ప్రస్తావిస్తే...ఇప్పుడు ఆ బ్రిడ్జి పనులను ప్రారంభించారని కవిత గుర్తు చేశారు.

కార్మికులకు తీరని అన్యాయం

సింగరేణి, ఆర్టీసీ సహా అన్ని రంగాల్లోని కార్మికులను రేవంత్ సర్కార్ ఘోరంగా మోసం చేస్తోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు మినిమమ్ వేజేస్ ఫిక్స్ చేశామంటూ గతంలో ఎవరు ఇలా చేయలేదని ఈ ముఖ్యమంత్రి చెబుతున్నారని కవిత అన్నారు. కానీ ఆయన మినిమమ్ వేజేస్ పేరుతో పచ్చి దగా చేశారన్నారు. ఆరేళ్ల క్రితమే మల్కాజ్ గిరి ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి సీఎం కు కార్మికులకు మినిమమ్ వేజేస్ 20 వేలు ఉండాలని రేవంత్ రెడ్డి లేఖ రాశారని చెప్పారు. ఆయన లేఖలో ఏదైతే కేటగిరీ చెప్పారో ఆ కేటగిరీకి ముఖ్యమంత్రి అయ్యాక రేవంత్ రెడ్డి రూ. 16 వేల వేతనం ఫిక్స్ చేశారన్నారు. అంటే ఆరేళ్ల తర్వాత నాలుగు వేలు తగ్గించి 16 వేల వేతనం ఇస్తామని గొప్పగా చెబుతుండటం కార్మికులను నయవంచనకు గురిచేయటమేనని చెప్పారు. ఇక సింగరేణిలో కార్మికుల చెమట, రక్తాన్ని పీల్చి మరి దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఒక్క రూపాయి తో అయ్యే పనికి పది రూపాయలు ఖర్చు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ

వచ్చాక మనం డిపెండెంట్ ఉద్యోగాలు సాధించుకున్నాం. కానీ కాంగ్రెస్ వాటిని పొగొట్టే పనిచేస్తోందని కవిత మండిపడ్డారు. ఐఎన్ టీయూసీ, దాని తోక పార్టీతో అధికారం చెలాయిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. బోడ జనార్ధన్ రాకతో మా హెచ్ఎంఎస్ కు సింగరేణిలో మరింత బలం వస్తుంది. ఆయన సహకారంతో సింగరేణి కార్మికుల కోసం ప్రభుత్వంపై మరింత గట్టిగా పోరాటం చేస్తామని కవిత చెప్పారు.

3ర్టీసీ విలీనం ఊసే లేదు

రేవంత్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను కూడా అన్యాయం చేస్తుందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పి రెండున్నరేళ్లు మొద్దు నిద్రపోయారని విమర్శించారు. రాజు గౌడ్ అనే ఆర్టీసీ డ్రైవర్ బలిదానం చేసుకునే వరకు కూడా విలీనం ఊసే ఎత్తలేదన్నారు. ఇటీవల పెట్రోల్ ధరలపై ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులను ముందు వడ్లు కొనాలని సూచించినందుకు ఓ ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగం తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ మేమంతా పోరాటం చేస్తే వెనక్కి తగ్గారని చెప్పారు. అంటే ప్రశ్నిస్తే తట్టుకోలేని కర్కష పాలన ఈ రాష్ట్రంలో జరుగుతోందని మండిపడ్డారు. ఆర్టీసీ ఛైర్మన్ గా పనిచేసిన బోడ జనార్ధన్ సహకారంతో ఆర్టీసీ కార్మికుల కోసం కూడా పోరాడుతామన్నారు.

ఎన్టీఆర్, కేసీఆర్ కన్నా ఉన్నతంగా ఆలోచించారు- బోడ జనార్దన్

ఒక మహిళ నాయకురాలు పార్టీ పెట్టి ప్రజల సమస్యల కోసం పోరాటం చేస్తానని ముందుకు రావటం చాలా ధైర్యంతో కూడిన విషయమని మాజీ మంత్రి బోడ జనార్దన్ అన్నారు. అప్పట్లో ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ అనే మూడు అంశాలతో అధికారంలోకి రాగా ఆ తర్వాత కేసీఆర్ గారు నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ మూడు అంశాలతో అధికారంలోకి వచ్చారని చెప్పారు. కానీ కవిత మాత్రం పాంచజన్యం అంటూ ఐదు కీలకమైన అంశాలతో ఆ ఇద్దరు నాయకుల కన్నా ఉన్నతంగా ఆలోచించారని చెప్పారు. కవిత ప్రకటించిన మేనిఫెస్టో నచ్చి టీఆర్ఎస్ లో చేరుతున్నారు. రాష్ట్రానికి మహిళ సీఎం అయితే ఎంతో అభివృద్ధి ఉంటుందని చెప్పారు. ఇక నుంచి కాంగ్రెస్ పై పెద్ద ఎత్తున పోరాటం చేస్తూ... టీఆర్ఎస్ ను బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేస్తానని చెప్పారు.

పశ్చిమాసియాలో మళ్లీ సెగలు

ఈకబురు, వాషింగ్టన్/దుబాయ్: అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఒకవైపు శాంతి చర్చలు కొనసాగుతుండగానే.. మరోవైపు ఇరుదేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ సైనిక స్థావరంపై బుధవారం రక్షణాత్మక దాడికి దిగినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. అంతకుముందు ఇరాన్ అటాక్ డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది.

హార్మూజ్ జలసంధి పరిసరాల్లో ముప్పుగా పరిణమించిన నాలుగు ఇరాన్ వన్-వే దాడి డ్రోన్లను అమెరికా సెంట్రల్ కమాండ్ దళాలు కూల్చివేసినట్లు వెల్లడించింది. బందర్ అబ్బాస్‌లోని ఇరాన్ గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌పై అమెరికా దళాలు క్షిపణులు వర్షం కురిపించాయి. ఐదో డ్రోన్‌ను ప్రయోగించడానికి ఇరాన్ జవాన్లు సిద్ధమవుతున్న సమయంలోనే ఈ దాడి జరిగింది.

ఒప్పందం దగ్గర్లోనే ఉంది

ఇరాన్ సైనిక శక్తి చాలావరకు క్షీణించిందని, అందుకే తమతో చర్చలకు ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. బుధవారం కేబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి తొందరేమీ లేదని చెప్పారు. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం విషయంలో తాము తొందరపడడం లేదన్నారు. అయితే, అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం దగ్గర్లోనే ఉందని వ్యాఖ్యానించారు.

అలాగైతే ఒమన్‌ను పేల్చేస్తాం: ట్రంప్

హార్మూజ్ జలసంధిని నియంత్రించడానికి ఒమన్ సహా ఏ ఒక్క దేశాన్ని కూడా అనుమతించబోమని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే కొత్త ఒప్పందంలో భాగంగా.. ఇరాన్, ఒమన్ కలిసి హార్మూజ్ గుండా జరిగే రవాణాను నియంత్రిస్తాయంటూ వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఆ జలసంధిని ఎవరూ కంట్రోల్ చేయలేరని అన్నారు. అవి అంతర్జాతీయ జలాలు అని గుర్తుచేశారు.ఒమన్ కూడా అందరిలాగే ప్రవర్తించాలని వ్యాఖ్యానించారు. లేకపోతే మనం ఒమన్‌ను కూడా పేల్చివేయాల్సి వస్తుందని తేల్చిచెప్పారు.

కువైట్‌లో అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి

అమెరికాపై ఇరాన్ సైన్యం ప్రతీకార దాడులకు దిగింది. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై బుధవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. అయితే, వీటిని కువైట్ గగనతల రక్షణ వ్యవస్థలు మధ్యలోనే కూల్చివేసినట్లు అమెరికా సైనిక వర్గాలు గురువారం స్పష్టంచేశాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని ఆరోపించాయి. తమ భూభాగంపై దాడి జరిగిందని కువైట్ ప్రకటించింది. అయితే, తమపై తొలుత దాడిచేసినందుకు ప్రతీకారంపై ఓ గల్ఫ్ దేశంలో అమెరికా స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ తేల్చిచెప్పింది. ఒమన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఒమన్, అమెరికా మిత్రదేశాలు. అమెరికా సైనిక కార్యక్రమాలకు ఒమన్ సహకరిస్తోంది. అమెరికా, ఇరాన్‌ల మధ్య నిశ్శబ్ద మధ్యవర్తిగా వ్యవహరిస్తూ వచ్చింది.

ప్రాథమిక ఒప్పందం సిద్ధం

డొనాల్డ్ ట్రంప్ ఆమోదమే తరువాయి

వాషింగ్టన్: కాల్పుల విరమణను పొడిగించడం, ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలను తిరిగి ప్రారంభించడమే లక్ష్యంగా అమెరికా, ఇరాన్‌లు ఒక ప్రాథమిక ఒప్పందానికి

వచ్చినట్లు సమాచారం. అయితే, ఈ ఒప్పందం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తుది ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన అంగీకరిస్తే ప్రాథమిక ఒప్పందం అమల్లోకి వస్తుందని చెబుతున్నారు. ఇరుపక్షాల ప్రతినిధులు ఇటీవలే 60 రోజుల అవగాహన ఒప్పందం ముసాయిదాపై అంగీకారానికి వచ్చారు. ఇది నిజంగా అమల్లోకి వస్తే పశ్చిమాసియాలో అతిపెద్ద దౌత్యపరమైన పురోగతిగా నిలిచే అవకాశం ఉంది.

అమెరికా, ఇరాన్‌ల మధ్య మళ్లీ దాడులు జరుగుతున్న తరుణంలో కాల్పుల విరమణ ఏ క్షణంలోనైనా కుప్పకూలవచ్చనే భయాందోళనలు పెరిగాయి. అయినప్పటికీ ఇరుపక్షాలు ప్రాథమిక ఒప్పందానికి రావడం విశేషం. ఇందులో చాలా అంశాలు మంగళవారం నాటికే ఖరారయ్యాయని అమెరికా అధికారులు తెలిపారు. తమ ఉన్నతస్థాయి నాయకుల నుంచి ఆమోదం పొందామని ఇరాన్ ప్రతినిధులు సైతం పేర్కొన్నారు. దీనిపై తన నిర్ణయం ఏమిటన్నది ఇంకా డొనాల్డ్ ట్రంప్ బయటపెట్టలేదు. ఒప్పందం ముసాయిదాలోని వివరాలను వైట్ హౌస్ ధ్రువీకరించలేదు.

ఆ మాటకు

పొంగులేటి కట్టుబడి ఉండాలి: కేటీఆర్

ఈకబురు, హైదరాబాద్:
సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ''ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7

ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులకు మద్దతివ్వడం సరికాదు

ఈకబురు,హైమాస్కో: ఉగ్రవాదంపై పోరులో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని, ద్వంద్వ ప్రమాణాలు తగవని జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్ పేర్కొన్నారు. రష్యాలో జరిగిన అంతర్జాతీయ భద్రతా ఫోరంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఖండించాలని, రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులకు మద్దతివ్వడం తగదని పరోక్షంగా చైనా, పాకిస్థాన్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఎదురవుతున్న భద్రతా ముప్పులను ఎదుర్కొవాలంటే రెండో ప్రపంచ యుద్ధానంతరం నిర్మించిన వ్యవస్థల్లో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సంస్కరణల్లో దక్షిణార్ధగోళ దేశాలకు అధిక ప్రాధాన్యమివ్వాలని.. వాటి అభిప్రాయాలకు ఎక్కువ విలువ ఇవ్వాలని అన్నారు.

ఉక్రెయిన్ విదేశాంగమంత్రితో జైశంకర్ భేటీ

నికోసియా (సైప్రస్): భారత విదేశీవ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సిబిహాతో భేటీ అయ్యారు. రష్యాఉక్రెయిన్ యుద్ధంలో క్షేత్రస్థాయి పరిస్థితిని వీరు సమీక్షించారు. శాంతి నెలకొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సైప్రస్‌లో జరుగుతున్న ఐరోపా యూనియన్ విదేశాంగ మంత్రుల అనధికారిక సమావేశం (జిమ్నిక్ ఫోరం)లో పాల్గొనేందుకు వచ్చిన వీరు లిమాసోల్ నగరంలో కలిశారు. సమావేశం ప్రయోజనకరంగా సాగిందని, ఉక్రెయిన్ ఘర్షణపై రెండు పక్షాలూ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచాయని సోషల్ మీడియా పోస్టులో జైశంకర్ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నామని, సమగ్ర శాంతిని కోరుకుంటున్నామని ఉక్రెయిన్ విదేశాంగమంత్రి తెలిపారు. శాంతి ప్రక్రియలో భారత్ బలమైన గొంతుకను, విలువైన అభిప్రాయాలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా ఇరువురు మంత్రులు చర్చించారు. పరస్పర ప్రయోజనకర అంశాలపై క్రమబద్ధంగా చర్చలు కొనసాగించాలని కూడా నిర్ణయించారు.

సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌తో కూడా జైశంకర్ భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలు, పశ్చిమాసియా ఘర్షణ తదితర కీలక విషయాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. సైప్రస్ అధ్యక్షుడు ఇటీవల భారత దేశంలో పర్యటించినపుడు కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాల అమలు, తదుపరి చర్యలపైనా సమీక్షించారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, శాంతి

ఇరాన్- అమెరికా సీజ్‌ఫైర్ మరోసారి పొడిగింపు?

ఈకబురు, : అమెరికా ఇరాన్ యుద్ధం విషయంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అమల్లో ఉన్న కాల్పుల విరమణను మరో 60 రోజుల పాటు పొడిగించేందుకు, ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలను ప్రారంభించేందుకు అమెరికా, ఇరాన్ ప్రతినిధులు ఓ తాత్కాలిక ఒప్పందానికి చేరువైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా సంతకం చేయాల్సి ఉందని పేర్కొన్నాయి. ఇరు దేశాల దాడులతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

వేతనం 'సున్నా' డివిడెండ్ రూ.9.66 కోట్లు

ప్రపంచ కుబేరుల్లో 21వ స్థానం, ఆసియా కుబేరుల్లో రెండో స్థానంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ఛైర్మన్ ముకేశ్ అంబానీ వేతనం ఎంతో తెలుసా.. సున్నా! అవును వరుసగా ఆరో ఆర్థిక సంవత్సరం (2025-26) లోనూ ఆయన వేతనం తీసుకోలేదు. కంపెనీలో తనకు నేరుగా ఉన్న 1.61 కోట్ల షేర్లపై లభించిన డివిడెండ్ (రూ.9.66 కోట్లు) మాత్రమే ఆయన అందుకుంటున్నారు. 2020లో కొవిడ్-19 పరిణామాలు దేశ సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తున్నప్పుడు.. తమ గ్రూపు వ్యాపారాలన్నీ తిరిగి పూర్తి స్థాయిలో ఆదాయాలు ఆర్జించేవరకు వేతనం తీసుకోనని ఆ ఏడాది జూన్‌లో ముకేశ్ ప్రకటించారు. ఆరేళ్లుగా ఆ విధానాన్నే ఆయన కొనసాగిస్తూ వస్తున్నారు. అంతకుముందు 2008-09 నుంచి 2019-20 వరకు ఆయన వార్షిక పారితోషికం కింద రూ.15 కోట్లు తీసుకున్నారు.

2025-26లో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.95,754 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. సంస్థ చరిత్రలో ఇదే అత్యధికం. అయినా ముకేశ్ వేతనం తీసుకోలేదని, రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజా వార్షిక నివేదిక వెల్లడించింది.

మిగతావారికి ఎంతెంతంటే..

2025-26లో ముకేశ్ అంబానీ బంధువులు నిఖిల్, హితల్ మేస్వాని వార్షిక పారితోషికంలో ఎలాంటి మార్పు లేకుండా రూ.25 కోట్లుగానే కొనసాగింది.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ పారితోషికం 2024-25లో రూ.19.96 కోట్లు కాగా, 2025-26లో రూ.20.58 కోట్లకు పెరిగింది.

రిలయన్స్ బోర్డులో డైరెక్టరుగా ఉన్న ముకేశ్ కుమారుడు ఆకాశ్, కుమార్తె ఈశాకు సిట్టింగ్ రుసుము కింద రూ.5 లక్షలు, కమీషన్ రూపేణా రూ.2.5 కోట్లు లభించింది. మరో కుమారుడు అనంత్ అంబానీ గతేడాది రిలయన్స్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా నియమితులయ్యారు. ఈయనకు 2025-26లో రూ.12.17 కోట్ల (రూ.2.29 కోట్ల కమీషన్‌తో కలిపి) వేతనం లభించింది.

బోర్డులోని స్వతంత్ర డైరెక్టర్ల కమీషన్ రూ.2.25 కోట్ల నుంచి రూ.2.5 కోట్లకు పెరిగింది. దీనికి సిట్టింగ్ రుసుము అదనం. రిలయన్స్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఎస్‌బీఐ మాజీ ఛైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య, మాజీ సీవీసీ కేవీ చౌదరి, కేవీ కామత్ లాంటి ప్రముఖులు ఉన్నారు.

జూన్ 19న ఏజీఎం

రిలయన్స్ ఇండస్ట్రీస్ 49వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) జూన్ 19న మధ్యాహ్నం 2 గంటలకు జరగనుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ ఏజీఎంలో జియో ప్లాట్‌ఫామ్స్, రిటెయిల్ విస్తరణ, స్వచ్ఛ ఇంధనం, డీప్ టెక్ వ్యాపారాలపై కీలక వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

ఆర్ఐఎల్‌లో 50% వాటా ప్రమోటర్లదే

రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో నేరుగా 1.61 కోట్ల షేర్లు ముకేశ్ అంబానీకి ఉన్నాయి. 2024-25కు ఒక్కో షేరుపై రూ.6 డివిడెండును కంపెనీ ప్రకటించింది. ఈ ప్రకారం ముకేశ్ అంబానీకి డివిడెండు ఆదాయం రూ.9.66 కోట్లు లభించింది. ఆయన నేతృత్వంలోని ప్రమోటరు గ్రూపునకు కంపెనీలో మొత్తం 50.07% వాటా(664.5 కోట్ల షేర్లు) ఉండటంతో.. దీని ద్వారా రూ.3,987 కోట్ల డివిడెండు ఆదాయం లభించింది.

విపణిలోకి రిలయన్స్ సోలార్ మాడ్యూళ్లు

జామ్‌నగర్ గిగా కాంప్లెక్స్‌లో ఉత్పత్తి

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్, తమ కొత్త ఇంధన వ్యాపారంలో కీలక పురోగతి సాధించింది. గుజరాత్‌లోని జామ్‌నగర్ గ్రీన్ ఎనర్జీ మ్యానుఫ్యాక్చరింగ్ కాంప్లెక్స్ నుంచి 200 మెగావాట్-పీక్ (ఎండబ్ల్యూపీ) సామర్థ్యం గల ప్రీమియం, హై-ఎఫిషియెన్సీ సోలార్ మాడ్యూళ్ల మొదటి బ్యాచ్‌ను విడుదల చేసినట్లు కంపెనీ ప్రకటించింది. 2025-26లో కంపెనీ కొత్త ఇంధన వ్యాపార కార్యకలాపాల ప్రారంభాన్ని ఇది సూచిస్తోంది. జామ్‌నగర్‌లో 5000 ఎకరాల్లో విస్తరించి ఉన్న 'ధీరూభాయ్ అంబానీ గ్రీన్ ఎనర్జీ గిగా కాంప్లెక్స్'ను సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, బయో-ఎనర్జీ మౌలిక సదుపాయాలతో కూడిన సమగ్ర శుద్ధ ఇంధన తయారీ వ్యవస్థగా అభివృద్ధి చేస్తున్నారు.

గిగా కాంప్లెక్స్ నుంచి వచ్చిన మొదటి బ్యాచ్ 720 వాట్ పీక్ బీఐఎస్-సర్టిఫైడ్ హెటెరోజంక్షన్ టెక్నాలజీ (హెచ్‌జేటీ) సోలార్ ప్యానెళ్లు.. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న సాధారణ ప్యానెళ్ల కంటే 10% ఎక్కువ ఇంధనాన్ని ఇస్తాయని, 25% తక్కువ క్షీణతను కలిగి ఉంటాయని రిలయన్స్ తెలిపింది.

పలు విభాగాల్లో పెట్టుబడులు, లక్ష్యాలు ఇలా..

ప్రస్తుతం సెల్, మాడ్యూల్ తయారీ లైన్లను క్రమంగా ప్రారంభిస్తున్న రిలయన్స్, వార్షిక సోలార్ తయారీ సామర్థ్యాన్ని 10 గిగావాట్-పీక్‌కు చేర్చడమే కాకుండా, భవిష్యత్తులో రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. పాలీసిలికాన్, గ్లాస్, ఇంగోట్స్, వేఫర్స్ తయారీని ఇక్కడ దశలవారీగా ప్రారంభిస్తున్నారు.

రిలయన్స్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్ గిగా ఫ్యాక్టరీ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రారంభంలో లక్ష్యం ఏడాదికి 40 గిగావాట్-అవర్స్ కాగా, దీర్ఘకాలంలో 100 గిగావాట్-అవర్స్‌కు పెంచనున్నారు.

కొత్త ఇంధన ప్లాంట్లు ఇలా

నార్వేకు చెందిన ఎలక్ట్రోలైజర్ సంస్థ 'నెల్ ఏఎస్ఏ' నుంచి ఆల్కలైన్ ఎలక్ట్రోలైజర్ల కోసం ప్రత్యేక సాంకేతిక లైసెన్సింగ్ హక్కులను పొందిన తర్వాత, రిలయన్స్ ఎలక్ట్రోలైజర్ గిగా ఫ్యాక్టరీ పనులను ప్రారంభించింది.

శామ్‌సంగ్ సీ అండ్ టీ కార్పొరేషన్‌తో దీర్ఘకాలిక గ్రీన్ అమ్మోనియా కొనుగోలు ఒప్పందంపై రిలయన్స్ సంతకం చేసింది. దీని సరఫరా 2028-29 ద్వితీయార్థంలో ప్రారంభం కానుంది.

గుజరాత్‌లోని కచ్‌లో రిలయన్స్ 5,50,000 ఎకరాల్లో భారీ పునరుత్పాదక ఇంధన హబ్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇక్కడ ప్రతిరోజూ గరిష్ఠంగా 55 ఎండబ్ల్యూపీ సోలార్ మాడ్యూళ్లు, 150 మెగావాట్ అవర్ల బ్యాటరీ కంటెయినర్ల విస్తరణ జరగనుంది.

ప్రస్తుతం 35 ఆపరేటింగ్ ప్లాంట్ల ద్వారా రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ఉత్పత్తి రోజుకు 270 టన్నులు దాటింది. 2026-27 నాటికి 55 ప్లాంట్ల ద్వారా దీన్ని రోజుకు 1100 టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

రిలయన్స్ శుద్ధ ఇంధన ప్లాట్‌ఫామ్ కోసం రూ.75,000 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశంలో 2 లక్షల కంటే ఎక్కువ హరిత ఉద్యోగాల లభిస్తాయని, ఇంధన ఖర్చులు తగ్గడంతో పాటు దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని కంపెనీ స్పష్టం చేసింది.

రూ.6,000 కోట్ల రుణ సమీకరణ

ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ గతేడాది డిసెంబరులో రిలయన్స్ ఇండస్ట్రీస్ రేటింగ్‌ను 'బీబీబీ+' నుంచి 'ఏ-'కు పెంచడంతో 2025-26లో 10 జపాన్, తైవాన్ బ్యాంకుల ద్వారా 91.9 బిలియన్ జపాన్ యెన్ లేదా 625 మిలియన్ డాలర్ల (సుమారు రూ.6,000 కోట్లు) రుణాన్ని సంస్థ సమీకరించింది.

యూపీఐ ద్వారా PF విత్‌డ్రా.. కొత్త రూల్స్ ఇవే!

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (EPFO), ఈపీఎఫ్ఓ 3.0 ప్రారభించడానికి సిద్ధమవుతోంది. కాబట్టి చందాదారులు త్వరలోనే తమ పీఎఫ్ డబ్బును మరింత వేగంగా, సులభంగా పొందగలుగుతారు. ఈ కొత్త విధానం ద్వారా.. సభ్యులు యూపీఐ ద్వారా తమ పీఎఫ్ డబ్బును నేరుగా తమ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసుకోవచ్చని, తద్వారా పేపర్ వర్క్, ప్రాసెసింగ్ సమయం వంటివి గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. అయితే.. చాలామందికి ఉన్న సందేహం ఏమిటంటే.. ఖాతా నుంచి ఎంత డబ్బు విత్‌డ్రా చేయవచ్చు?, మొత్తం బ్యాలెన్స్‌ను తక్షణమే పొందవచ్చా?. దీనికి గురించి పూర్తి సమాచారం ఇక్కడ తెలుసుకుందాం.

EPFO 3.0 గురించి

ఈపీఎఫ్ఓ 3.0 అనేది ప్రావిడెంట్ ఫండ్ లావాదేవీలను సులభతరం చేయడానికి.. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ తీసుకొస్తున్న డిజిటల్ ప్రక్రియ. ఇదివరకు పీఎఫ్ డబ్బు తీసుకోవాలంటే ఫారమ్‌లు, క్లెయిమ్ ప్రాసెసింగ్, ధృవీకరణ వంటి ప్రక్రియలకు ఎక్కువ సమయం పట్టేది. కానీ కొత్త విధానం ద్వారా.. ఈ ప్రక్రియ సులభతరం కానుంది. చందాదారులు తమ పీఎఫ్ ఖాతాలో అర్హత కలిగిన మొత్తాన్ని యూపీఐ ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. ఇది పూర్తిగా పేపర్‌లెస్ విధానం. కాబట్టి ఉద్యోగులకు సమయం, శ్రమ రెండూ తగ్గుతాయి.

ఎంత విత్‌డ్రా చేసుకోవచ్చు?

ఈపీఎఫ్ఓ 3.0 ప్రకారం.. సభ్యులు తమ ఖాతాలోని మొత్తంలో 50% నుంచి 75% వరకు మాత్రమే విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంటే.. మొత్తం డబ్బును ఒక్కసారిగా తీసుకునే అవకాశం లేదు. దీనికి ప్రధాన కారణం.. ఉద్యోగుల రిటైర్మెంట్ భద్రత. భవిష్యత్తు కోసం కొంత మొత్తం ఖాతాలో తప్పనిసరిగా ఉండేలా ప్రభుత్వం నియమాలు రూపొందిస్తోంది.

ఖాతాలో మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలి?

కొత్త నియమాల ప్రకారం.. పీఎఫ్ ఖాతాలో కనీసం 25శాతం ఉండాలి. దీనిని ఉద్యోగులు తమ రిటైర్మెంట్ సమయంలో ఉపయోగించుకోవచ్చు.

అయితే.. ఆటో సెటిల్మెంట్ పరిమితిని పెంచారు. ఇప్పటివరకు ఆటో సెటిల్మెంట్ ద్వారా రూ.1 లక్ష వరకు మాత్రమే క్లెయిమ్‌లు త్వరగా ప్రాసెస్ అయ్యేవి. ఇప్పుడు ఈ పరిమితిని రూ.5 లక్షలకు పెంచారు. దీని వల్ల సభ్యులు తక్షణ అవసరాల కోసం పెద్ద మొత్తాన్ని త్వరగా పొందగలుగుతారు.

యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా

ఈపీఎఫ్ఓ 3.0 విధానంలో.. చందాదారుడు ముందుగా తాను ఎంత మొత్తం విత్‌డ్రా చేసుకోవచ్చు అనేది చూడవచ్చు. తరువాత తన బ్యాంక్ ఖాతాతో లింక్ చేసిన యూపీఐ ఐడీ ద్వారా ఆ మొత్తాన్ని నేరుగా బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియలో సేఫ్టీ కోసం యూపీఐ పిన్ ధ్రువీకరించాల్సి ఉంటుంది. డబ్బు ఖాతాలో జమ అయిన తర్వాత సభ్యుడు ఆ మొత్తాన్ని డిజిటల్ చెల్లింపులు, బ్యాంకుకు బదిలీ చేయడం లేదా ఏటీఎం ద్వారా నగదు రూపంలో విత్‌డ్రా చేసుకోవచ్చు.

EPFO 3.0 ఎప్పుడు ప్రారంభమవుతుంది?

కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రకారం.. యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రాకు సంబంధించిన అన్ని పరీక్షలు పూర్తయ్యాయి. కాబట్టి ఇది త్వరలోనే ఈ సదుపాయం ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. అయితే.. తేదీని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు.

టాటా టియాగో ఈవీ జీ రూ.6.99 లక్షలు

దిల్లీ: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) తదుపరి తరం టియాగో, టియాగో సీఎన్‌జీ, ఈవీ (విద్యుత్తు) మోడళ్లను దేశీయ విపణిలోకి విడుదల చేసింది. ప్రారంభ స్థాయి టియాగో పెట్రోల్ హ్యాచ్‌బ్యాక్ ధరను రూ.4.69 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. సీఎన్‌జీ వెర్షన్ ధరను రూ.5.79 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. ఈవీ ధరను రూ.6.99 లక్షలుగా పేర్కొంది. టియాగో ఈవీని బ్యాటరీ అద్దె ప్రాతిపదికన (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) తీసుకుంటే రూ.4.69 లక్షలు + కిలోమీటరుకు రూ.2.60 చొప్పున చెల్లించాలి. కొత్త టియాగోలో డిజైన్, ఇంటీరియర్, సదుపాయాల పరంగా చాలా మార్పులు చేపట్టారు. మారుతీ సుజుకీ స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి మోడళ్లతో ఈ కారు పోటీ పడనుంది. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్, డ్యూయల్ వైర్‌లెస్ ఛార్జర్, 360 డిగ్రీల కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటర్, రియర్ ఏసీ వెంట్స్, క్రూయిజ్ కంట్రోల్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, ఆటో హెడ్‌ల్యాంప్స్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, హిల్ హోల్డ్ కంట్రోల్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

ఒకసారి ఛార్జింగ్‌తో 205215 కి.మీ. ప్రయాణం

టియాగో ఈవీ రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లలో లభిస్తుంది. 19.2 కిలోవాట్ అవర్ బ్యాటరీ సామర్థ్యం కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 205 కిలోమీటర్లు, 24 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 285 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. 3.3 కిలోవాట్ పోర్టబుల్ ఛార్జర్, 7.2 కిలోవాట్ హోమ్‌ఛార్జర్, 30 కిలోవాట్ డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ ఆప్షన్లతో లభిస్తుంది.

ఇంధన ధరల పెంపు ప్రభావం పడొచ్చు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాహనాల గిరాకీపై ఇంధన ధరల పెంపు ప్రభావం పడొచ్చని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర అభిప్రాయ పడ్డారు. వాహన అమ్మకాలపై పడే ప్రతికూల ప్రభావం అంచనా వేయాలంటే.. మొత్తం వినియోగ తీరుపై, వినియోగదారుల సెంటిమెంటుపై ధరల పెరుగుదల ప్రభావాన్ని పర్యవేక్షించాలని వివరించారు. 202627లో ప్రయాణికుల వాహనాల (ముఖ్యంగా కార్ల) అమ్మకాల్లో 10% వృద్ధి అంచనాను మార్చడం కూడా తొందరపాటు చర్య అవుతుందని అభిప్రాయపడ్డారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 650

రాయల్ ఎన్‌ఫీల్డ్ తన బుల్లెట్ 650 బైక్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటి ధర రూ.3.65 లక్షలు (ఎక్స్-షోరూమ్). 648 సీసీ ప్యార్లల్-ట్విన్ ఇంజిన్‌తో రూపొందిన ఈ బైక్ 46.4 బీహెచ్‌పీ, 52.3 ఎన్ఎంలను ఉత్పత్తి చేస్తుంది. 6-స్పీడ్ గేర్ బాక్స్, షోవా టెలిస్కోపిక్ ఫోర్క్, ట్విన్ రియర్ షాక్ అబ్జార్బర్స్, డ్యూయెల్ ఛానెల్ ఏబీఎస్, అనలాగ్ స్పీడోమీటర్, డిజిటల్ డిస్ప్లే, ట్రిప్పర్ నావిగేషన్ పాడ్ వంటివి ఈ బైక్‌లో ఉన్నాయి. కెనాన్ బ్లాక్, బాటిల్‌షిప్ బ్లూ రంగుల్లో ఈ బైక్‌లు లభ్యమవుతాయి. బుల్లెట్ 650 క్లాసిక్ డిజైన్‌ను సంస్థ కొనసాగించింది. దీనికి చేతితో గీసిన సన్నని గీతలు (పిన్‌స్ట్రైప్స్), రెక్కల బ్యాడ్జ్‌తో కూడిన కన్నీటి చుక్క ఆకారపు ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. గుండ్రని ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, టైగర్-ఐ పైలట్ ల్యాంప్స్, క్రోమ్ హ్యాండిల్‌బార్లు, మిర్రర్స్, క్రోమ్‌తో ఫినిష్ చేసిన పీ-షూటర్ ఎగ్జాస్ట్‌లు ఉన్నాయి.

మీ సంపాదన ఎటు వెళ్తోంది?

ఉద్యోగులకు వేతనం పడిన 48గంటలు ఎంతో సంతోషంగా ఉంటుంది. ఆ తర్వాత ఇంటి అద్దె, ఈఎంఐల కోతలు, క్రెడిట్ కార్డుల బిల్లులు.. ఇలా ఒకదాని తర్వాత ఒకటి వస్తుంటాయి. వీటన్నింటి మధ్యలో పొదుపు, పెట్టుబడులు.. ఇవన్నీ పూర్తి చేసే సరికి.. చివరికి మళ్లీ ఒకటో తారీఖు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఆర్థిక సమస్యలు ఎప్పుడూ తక్కువ సంపాదించడం వల్ల రావు. ఒక స్పష్టమైన ప్రణాళిక లేకుండా డబ్బును ఇష్టానుసారం ఖర్చు చేయడం వల్లే వస్తుంటాయి. ఈ నేపథ్యంలో సరైన ప్రణాళిక అంటే ఎలా ఉండాలో చూద్దాం.

ఆయా అవసరాల కోసం జీతాన్ని కేటాయించడాన్ని భావోద్వేగాలతో కాకుండా, ఒక క్రమబద్ధమైన వ్యవస్థలా పరిగణించాలి. మీ ఆదాయం, నివసించే ప్రాంతం, కుటుంబ బాధ్యతలను బట్టి ఈ కేటాయింపుల శాతాలు మారొచ్చు. అత్యవసర ఖర్చులు, భవిష్యత్తు లక్ష్యాలు, అత్యవసర నిధి.. ఇవన్నీ ఒకదానితో ఒకటి పోటీపడకుండా అన్నింటికీ ఒకేసారి నిధులు కేటాయించడం దీని ముఖ్య ఉద్దేశం. ముందుగా తప్పనిసరి ఖర్చులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇంటి అద్దె, కిరాణా సామగ్రి, విద్యుత్, నీటి బిల్లులు, పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు ఇందులో భాగం. ఇంటి అద్దె లేదా గృహరుణ ఈఎంఐ జీతంలో 2535 శాతం మధ్యలో ఉండేలా చేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తుంటారు. ఆదాయంలో సగం కేవలం ఇంటి ఖర్చులకే పోతే, ఆ తర్వాత పొదుపు, పెట్టుబడులు, అత్యవసరాలకు ఏమీ మిగలదు.

ఈఎంఐల చేతిలో చిక్కుకోవద్దు

రుణం తీసుకున్న కొత్తలో వాయిదాలు చెల్లించడం సులభంగానే అనిపించవచ్చు. ఆ తర్వాత వాహన రుణం, వినియోగ వస్తువుల రుణాలు, క్రెడిట్ కార్డు బిల్లులు, వ్యక్తిగత రుణాలు ఇలా ఒక్కొక్కటిగా పెరుగుతూ పోతాయి. నెలాఖరు రాకముందే మీ భవిష్యత్తు జీతం వీటికి అంకితమైపోవడం మొదలవుతుంది. చేతికొచ్చే వేతనంలో మొత్తం ఈఎంఐలు 40 శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. ఆ పరిమితి దాటితే చిన్నపాటి అత్యవసర పరిస్థితి వచ్చినా తీవ్రమైన ఆర్థిక ఒత్తిడికి గురికావాల్సి వస్తుంది.

సిప్.. నిలకడగా కొనసాగితేనే

జీతం పెరిగాక పెట్టుబడులు మొదలుపెడదామని చాలామంది యువ ఉద్యోగులు వాయిదా వేస్తుంటారు. కానీ, క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) అనేది సరైన సమయం కోసం వేచి చూడటం కంటే, నిలకడ ద్వారానే ఎక్కువ లాభాలను ఇస్తుంది. ఆలస్యంగా చేసే పెద్ద పెట్టుబడుల కంటే, ముందుగా మొదలుపెట్టే చిన్నపాటి సిప్‌ల వల్లే ఎక్కువ ప్రయోజనం. జీతం ఖాతాలో పడిన వెంటనే, సిప్‌లోకి వెళ్లేలా తేదీలను నిర్ణయించుకోవాలి. ఆదాయం పెరిగే కొద్దీ సిప్ మొత్తాన్ని క్రమంగా పెంచుకుంటూ పోవచ్చు. ముందుగా పెట్టుబడికి అలవాటు పడటం ముఖ్యం.

మిగిలిందే పొదుపా..

వచ్చినదాంట్లో మిగిలిందే పొదుపు చేద్దాం అనే ఆలోచనా విధానాన్ని చాలామంది మార్చుకోవాలి. పొదుపు నెలాఖరులో అనుకోకుండా చేసేది కాదు. ఇతర ఖర్చులు మొదలుపెట్టే ముందు, మీకు మీరు చెల్లించుకునే నిర్ణీత మొత్తంగా దీన్ని పరిగణించినప్పుడు, ఇది మరింత మెరుగ్గా పనిచేస్తుంది. అత్యవసర నిధి, రికరింగ్ డిపాజిట్ లేదా ప్రత్యేక పొదుపు ఖాతాలకు ఆటోమేటిక్‌గా చిన్న మొత్తాలు బదిలీ అయ్యేలా చూసుకోవాలి. దీనిద్వారా కాలక్రమేణా ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. ఇది లేకపోతే, మనం గమనించకుండానే పొదుపు చేయాల్సిన డబ్బు జీవనశైలి ఖర్చుల్లో కలిసిపోయి కనుమరుగవుతుంది. పొదుపు స్థిరంగా కొనసాగాలంటే, బ్యాంకు ఖాతాలో జీతం జమైన వెంటనే నిర్ణీత పొదుపు పథకాలకు నేరుగా మళ్లించాలి.

బీమా.. వృథా కాదు

అనుకోని పరిస్థితుల్లో ఆర్థికంగా అండగా ఉండే బీమా పాలసీని చాలామంది ఉద్యోగులు నిర్లక్ష్యం చేస్తుంటారు. ఏళ్లతరబడి కూడబెట్టిన సొమ్ము ఒక్క ఆపద వల్ల ఆవిరైపోకుండా, ఆరోగ్య బీమా, టర్మ్ ఇన్సూరెన్స్ రక్షణ ఇస్తాయి. లేకపోతే, అనారోగ్యం పాలైనా, ఆదాయం ఆగిపోయినా కుటుంబ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. కుటుంబ సభ్యుల బాధ్యత ఉన్న ఉద్యోగులు, బీమా ప్రీమియాన్ని చెల్లించడం ఒక తప్పనిసరి ఆర్థిక బాధ్యతగా భావించాలి.

అందరికీ సరిపోయే ఆర్థిక ప్రణాళిక అంటూ ఏమీ ఉండదు. సామాజిక మాధ్యమాల్లో నిపుణుల పేర్లతో ఎన్నో సూత్రాలు వినిపిస్తూనే ఉంటాయి. కానీ, వాటన్నింటినీ పాటించడం ఎవరికీ సాధ్యం కాదన్న సంగతి గుర్తుంచుకోండి. నిజ జీవితంలో అవి పని చేయవు. అద్దె ఎక్కువగా ఉండే మెట్రో నగరాల్లో ఒంటరిగా ఉండే వ్యక్తి బడ్జెట్.. కుటుంబంతో కలిసి ఉండే వ్యక్తితో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. కాబట్టి, ఇతరులు పాటించే నిష్పత్తులను అనుకరించకూడదు. మీ డబ్బును ప్రతినెలా ఇష్టానుసారంగా కాకుండా, ఒక ప్రణాళికతో ఖర్చు చేయండి. మీకు ఏదీ భారం అనిపించని విధంగా మీ ఖర్చులు, పెట్టుబడుల కేటాయింపులు ఉండాలి. అప్పుడే మీ సంపాదనకు సరైన విలువ లభిస్తుంది.

చిరు చిత్రంలో నివేద?

'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా' లాంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా పేతురాజ్. వ్యక్తిగత కారణాలతో మూడేళ్లుగా తెరకు దూరంగా ఉన్న ఈ నాయిక ఇప్పుడు సినీప్రియుల్ని తిరిగి పలకరించేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఇప్పటికే తెలుగులో వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం'లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. కాగా, ఇప్పుడామె మరో క్రేజీ సినిమాలోనూ భాగమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిరంజీవి కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. అనస్వర రాజన్ ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమాలో నివేదా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. తనిప్పటికే సెట్స్‌లోకి అడుగు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మాస్ అంశాలతో నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో చిరుకి కుమార్తెగా అనస్వర కనిపించనుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

నాపై దృష్టి పెట్టాలని అప్పుడే గ్రహించా!

కెరీర్ ప్రారంభంలో బాడీ-షేమింగ్ వ్యాఖ్యలు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయంటోంది నటి హ్యూమా ఖురేషి. త్వరలోనే యశ్ హీరోగా రూపొందుతున్న 'టాక్సిక్' చిత్రంలో ఎలిజబెత్ పాత్రతో ప్రేక్షకుల్ని అలరించనుందీ తార. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నా రెండో సినిమా తర్వాత నా రూపం, ఆకృతి గురించి చాలా ప్రతికూల వ్యాఖ్యలను చదివాను. అవి నన్ను చాలా ప్రభావితం చేశాయి. దాంతోనే కొంతకాలం పాటు చాలా కుంగిపోయాను. నిరంతరం ఎదురయ్యే విమర్శలు ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతాయి. దానివల్ల నేను చాలా ఇబ్బందిపడ్డాను. కానీ, కాలక్రమేణా అనవసరమైన విషయాలను పక్కన పెట్టి నాపై నేను దృష్టి పెట్టాలని గ్రహించాను. ధ్యానం చేయడం, డైరీ రాయడం.. ఇంకా థెరపీ తీసుకోవడం లాంటివి మొదలుపెట్టాను. నెమ్మదిగా నా గురించి, రూపం గురించి నాకు మరింత భరోసా కలిగింది. ఈరోజు నవ్వగలను, నాపై నేనే జోకులు వేసుకోగలను. కొన్ని విషయాలను కూడా మరింత తేలికగా తీసుకోగలను. ఇప్పుడు నా పట్ల నేను సౌకర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాన"ని అంది.

రవితేజ చిత్రం రేసులోకి!



జూన్ నుంచి తెలుగు చిత్ర పరిశ్రమలో విడుదలల జోరు ఊపందుకుంటుంది. 'పెద్ది' మొదలు ఇక వరుసగా సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. జులై, ఆగస్టు నెలలపై చాలా సినిమాలే దృష్టిపెట్టాయి. ఆగస్టు నెలలో విడుదల ఖరారైన సినిమాల జాబితా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఆ నెల రేసులో రవితేజ 'ఇరుముడి' కూడా నిలిచే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఆ దిశగానే ఆ చిత్రానికి సంబంధించిన పనులు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. ఆగస్టులో వర్షాలు కురిసినా, సినిమాలకి అది మంచి సీజన్. దాంతో ఆ నెలలో విడుదల కోసం చాలా సినిమాలు ఆసక్తి చూపుతున్నాయి. రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఇరుముడి'. తండ్రీకూతుళ్ల మధ్య భావోద్వేగాలే ప్రధానంగా సాగే చిత్రమని తెలుస్తోంది. త్వరలోనే పాట విడుదలతో ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు మొదలు పెట్టే యోచనలో చిత్రబృందం ఉన్నట్టు సమాచారం. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది.

'పెద్ది' గురించి మోదీ అడిగారు: రామ్‌చరణ్

మారుమూల ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తమకంటూ ఓ గుర్తింపు కావాలని చేసిన పోరాటమే 'పెద్ది' సినిమా అని, ఇటీవల దిల్లీలో ప్రధాని మోదీని కలిసినప్పుడు ఈ సినిమా గురించి అడిగారన్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడిగా... బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వెంకట సతీశ్ కిలారు నిర్మించారు.

జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రచారం నిమిత్తం దేశమంతా తిరుగుతోంది. గురువారం దిల్లీలో విలేకర్ల సమావేశం నిర్వహించింది చిత్రబృందం.ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ "మట్టి వాసన ఉన్న కథ ఇది. గతంలో నేను చేసిన గ్రామీణ నేపథ్య సినిమాలన్నీ మంచి విజయాల్ని అందుకున్నాయి. ఆ జాబితాలో చేరే సినిమా ఇది. భారత దేశంలోని అత్యుత్తమ ఆటగాళ్లు చాలామంది గిరిజన ప్రాంతాల నుంచి వచ్చినవాళ్లే. 'పెద్ది' సినిమా దేని గురించి అని ప్రధాని మోదీ అడిగినప్పుడు గ్రామీణ సాధికారత గురించి మాట్లాడే కాన్సెప్ట్‌తో రూపొందుతోందని చెప్పా. అప్పుడు ఆయన ఓ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రచారం చేస్తున్నప్పుడు కొంతమంది యువకులు పైన జెర్సీ, కింద లంగోటా ధరించి కనిపించారనీ, తాము ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చినట్టు చెప్పారన్నారు.దాదాపు 40 ఏళ్ల కిందట ఆ గ్రామానికి చెందిన మొహమ్మద్ అనే వ్యక్తి భారత ఫుట్‌బాల్ జట్టుకు ఆడాడని, ఇప్పుడు అదే గ్రామం నుంచి 80 శాతం మంది ఫుట్‌బాల్ ఆడుతున్నట్టు తెలిసిందన్నారు. ఒక వ్యక్తి స్ఫూర్తి ఎంత పెద్ద మార్పుని తీసుకొస్తుందో ఆ సందర్భంగా మోదీ నాకు వివరించారు. 'పెద్ది' కూడా అలాంటి కథే. ఇందులోని పాత్ర కోసం ఏం కావాలో అంతా ప్రాణం పెట్టి చేశా" అన్నారు. జాన్వీ కపూర్ మాట్లాడుతూ "మనవైన మూలాల్ని ఆవిష్కరించే ఓ గొప్ప సినిమాలో భాగం కావడం ఎంతో తృప్తినిచ్చింది. కుటుంబమంతా కలిసి చూడాల్సిన సినిమా" అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ, వెంకట సతీశ్ కిలారు తదితరులు పాల్గొన్నారు.

అంతిమ నిర్ణయం ఏఐది కాకూడదు



ఇతర సాధనాల్లాగే ఏఐ సాంకేతికతని ఉపయోగించడం సరైనదే అయినప్పటికీ.. సృజనాత్మకత విషయంలో అదే అంతిమ నిర్ణయం కాకూడదని అంటున్నారు ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్. ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఏఐ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ వైద్య సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, లోకేషన్లు అన్వేషించడంలో ఉపయోగపడుతుంది కానీ, సినిమా నిర్మాణానికి కాదని అభిప్రాయపడ్డారు. "రచయితల వద్ద ఒక కుర్చీ ఖాళీగా ఉన్నప్పుడు దాన్ని ఏఐ ఆక్రమించడం నాకు అస్సలు ఇష్టం ఉండదు. నాకు ఆ ఖాళీని ప్రత్యామ్నాయంతో భర్తీ చేయాలని అనిపించదు. ఎందుకంటే ఆత్మకు ప్రత్యామ్నాయం ఉందని నేను నమ్మను. మన అనుభూతికంటే తాను ఎక్కువగా అనుభూతి చెందుతుందని భావించే కంప్యూటర్.. నేను పెరిగిన తీరుకు, నా విధానానికి పూర్తిగా విరుద్ధం. ఏఐ అనేది ప్రొడక్షన్ డిజైనర్ ఉపయోగించే ఒక సాధనం కంటే ఎక్కువ అని అనుకోను. అందుకే ఏఐని ఒక టూల్‌లాగానే ఉపయోగించండీ కానీ, అదే మీ అంతిమ నిర్ణయాధికారి కాకూడదు. నేను ఈ విషయంలో కచ్చితంగా పరిధిని నిర్ణయిస్తా" అని అన్నారు. ఇప్పటికే కథ చెప్పడానికి కూడా ఏఐ సాంకేతికతని వాడుతున్నారని హీరో లియోనార్డో డికాప్రియో, కేట్ బ్లాన్‌చెట్ తదితర హాలీవుడ్ నటులు విమర్శించారు. ఏదేమైనప్పటికీ చిత్రపరిశ్రమలో అనేక స్ట్రీమింగ్ యానిమేషన్, ప్రొడక్షన్ డిజైన్‌ల కోసం ఏఐని ఉపయోగిస్తున్నారు.

సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్స్ గ్లామర్‌కే పరిమితం కాదు: దర్శకుడు హేమంత్ మధుకర్

సందీప్ వంగా దర్శకత్వంలో ప్రభాస్ (Prabhas) హీరోగా 'స్పిరిట్' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా షూటింగ్‌లో త్రిప్తి డిమ్రీ జాయిన్ అయ్యారు. అయితే ఆమె పాత్ర గ్లామర్‌కే పరిమితం అవుతుందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరో డైరెక్టర్ హేమంత్ మధుకర్ స్పందిస్తూ.. సందీప్ వంగా సినిమాల్లో హీరోయిన్ క్యారెక్టర్లు చాలా బలంగా ఉంటాయని అన్నారు. త్రిప్తి (Triptii Dimri) పాత్ర ప్రేక్షకులను కచ్చితంగా ఆశ్చర్యపరుస్తుందని పేర్కొన్నారు."సందీప్ రెడ్డి వంగా (Sandeep Reddy Vanga) మహిళా పాత్రలను రాసే విధానాన్ని ప్రేక్షకులు తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఆయన సినిమాల్లోని కొన్ని ఇంటిమేట్ సీన్స్ చూసి, హీరోయిన్‌కు కేవలం గ్లామర్ పాత్రలే ఇస్తారని అనుకుంటారు. కానీ మీరు నిశితంగా పరిశీలిస్తే.. సందీప్ మహిళలకు చాలా బలమైన, వైవిధ్యమైన పాత్రలను ఇస్తారు. 'అర్జున్ రెడ్డి' సినిమాలో శాలిని పాండే పాత్రను చూస్తే.. ఆమె ఎక్కువగా సింపుల్ కాస్ట్యూమ్స్‌లోనే కనిపిస్తూ చాలా హోమ్లీ ఇమేజ్‌తో ఉంటుంది. కానీ ఆ క్యారెక్టర్‌లో ఎంతో ఎమోషన్ ఉంది. అలాగే 'యానిమల్' సినిమాలో రష్మిక పాత్రను గమనిస్తే.. భర్తకు, కుటుంబానికి మధ్య జరిగే ఘర్షణలను తట్టుకునే ఒక బలమైన భార్యగా చూపించారు. 'యానిమల్' హీరో సెంట్రిక్ ఫిల్మ్ అయినప్పటికీ రష్మిక తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు" అని హేమంత్ అన్నారు."హీరో, హీరోయిన్, విలన్.. ఇలా అందరి పాత్రలను సమానంగా, పవర్‌ఫుల్‌గా రాయడంపైనే సందీప్ వంగా దృష్టి పెడతారు. ఇక 'స్పిరిట్' సినిమాలో దీపికా పదుకొణె స్థానంలో త్రిప్తి వచ్చారనే వార్తలను నేను పట్టించుకోను. ఈ రోజుల్లో దర్శకులు వారు రాసుకున్న పాత్రకు ఎవరు సరిపోతారో చూసి ఎంపిక చేసుకుంటారు. త్రిప్తి కచ్చితంగా అందరి అంచనాలను అందుకుంటారని నేను నమ్ముతున్నాను" అని హేమంత్ అన్నారు.

ఎన్ని తరాలు మారినా ఆయన ప్రభావం ఎప్పటికీ చెరిగిపోదు: చిరంజీవి

దివంగత నటుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆయనను స్మరించుకున్నారు. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన ఎన్టీఆర్ చిరస్మరణీయులంటూ నివాళులర్పించారు. గతంలో ఆయనతో దిగిన ఫొటోను షేర్ చేశారు."ఎన్ని తరాలు మారినా ఆ తారక రాముని ప్రభావం చరిత్రలో ఎప్పటికీ చెరిగిపోదు. తెరపై అనేక పాత్రలను సజీవంగా ఆవిష్కరించిన మహానటుడిగా, ప్రజాజీవితంలో తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా.. అందరి హృదయాల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించిన నందమూరి తారక రామారావు చిరస్మరణీయులు. ఇటీవల ఎన్టీఆర్ జాతీయ పురస్కారం నాకు లభించడం ఎంతో ప్రత్యేకమైన గౌరవంగా భావిస్తున్నాను. అది ఆయనపై నాకు (Chiranjeevi) ఉన్న గౌరవానికి మరింత విలువైన గుర్తింపుగా నిలిచిపోతుంది" అని చిరంజీవి పేర్కొన్నారు.ఇక నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఈ ఉదయం నివాళులర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులు ఎన్టీఆర్‌ను స్మరించుకుంటూ పోస్ట్‌లు పెట్టారు.

భారత మహిళల శుభారంభం

.. తొలి టీ20లో ఇంగ్లాండ్‌పై ఘన విజయం

చెమ్‌స్‌ఫర్డ్: ఇంగ్లాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత మహిళలు శుభారంభం చేశారు. చెమ్‌స్‌ఫర్డ్ వేదికగా జరిగిన పోరులో ఆ జట్టును ఇండియన్ టీమ్ 38 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. జెమీమా రోడ్రిగ్స్ (69: 40 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్స్), యాస్తికా భాటియా (54: 40 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్స్) చెలరేగడంతో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ మహిళల జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 150 పరుగులకే పరిమితం అయింది. భారత బౌలర్లలో నందని శర్మ 3, క్రాంతి గౌడ్ 2, శ్రీచరణి, దీప్తి శర్మ ఒక్కో వికెట్ తీశారు.

అమీ జోన్స్ ఒంటరి పోరు..

189 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ రెండో ఓవర్‌లో క్రాంతి గౌడ్ బౌలింగ్లో సోఫియా డంక్లీ (16) వికెట్ కోల్పోయింది. మరో ఓపెనర్ లీసా క్యాప్సీ (6)ని సైతం క్రాంతి గౌడే ఔట్ చేసింది. అనంతరం హీథర్ నైట్‌తో కలిసి జట్టు కట్టిన అమీ జోన్స్ మరో వికెట్ పడకుండా స్కోర్ బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో 30 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకుంది. అయితే ప్రమాదకరంగా మారిన ఈ జోడీని శ్రీచరణి విడదీసింది. 13.2 ఓవర్లో రోడ్రిగ్స్ క్యాచ్ పట్టడంతో హీథర్ నైట్ ఔటైంది. మరోవైపు అమీ జోన్స్.. దీప్తి శర్మ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టింది. ఈ మ్యాచ్‌తోనే టీ20ల్లో ఆరంగేట్రం చేసిన నందని శర్మ.. అమీ జోన్స్‌కు చెక్‌పెట్టింది. షెఫాలీ వర్మ క్యాచ్ పట్టడంతో వెనుదిరిగింది. ఆ తర్వాతి బంతికే డానియెల్ గిబ్సన్‌ను బురిడీ కొట్టించింది. దీంతో 16 ఓవర్లకు 120/5 నిలిచిన ఆ జట్టు విజయంపై ఆశలు కోల్పోయింది. ఫ్రెయా కెంప్‌ను దీప్తి శర్మ ఔట్ చేయగా, ఇస్సీ వాంగ్‌ను బౌల్డ్ చేసి నందని శర్మ తన ఖాతాలో మరో వికెట్ వేసుకుంది. 18వ ఓవర్‌లో ఒకటి, చివరి ఓవర్‌లో మరో వికెట్ పడడంతో ఆ జట్టు 150 పరుగులకు పరిమితం అయింది.

దంచికొట్టిన జెమీమా, యాస్తికా

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. తొలి బంతికే స్టార్ బ్యాటర్ స్మృతి మంధానను, చివరి బంతికి షెఫాలీ వర్మను లారెన్ బెల్ ఔట్ చేసింది. అయితే యాస్తికా భాటియాతో జట్టు కట్టిన జెమీమా రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. తొలుత జెమీమా నెమ్మదిగా ఆడగా, యాస్తికా చెలరేగింది. ఇస్సీ వాంగ్ వేసిన మూడో ఓవర్‌లో యాస్తికా నాలుగు ఫోర్లు బాదింది. అంతేకాకుండా ఈ ఓవర్‌లో రెండు వైడ్ బాల్స్ ఫోర్లు వెళ్లాయి. దీంతో ఈ ఓవర్‌లో మొత్తం 27 పరుగులు వచ్చాయి. యాస్తికా దూకుడుతో స్కోర్ బోర్డు వేగాన్ని అందుకుంది. సోఫీ వేసిన ఓవర్లో జెమీమా ఓ ఫోర్ బాదగా, యాస్తికా సిక్స్, ఫోర్ కొట్టింది. పవర్ ప్లే ముగిసే సరికి భారత్ 73/2 వికెట్లతో నిలిచింది. ఈ క్రమంలో 31 బంతుల్లో యాస్తికా అర్ధశతకం నమోదు చేసింది. టిల్లీ వేసిన బంతికి సిక్స్ బాది రోడ్రిగ్స్ సైతం 31 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసింది. వీరి దూకుడైన బ్యాటింగ్‌తో జట్టు స్కోర్ 13 ఓవర్లకు 127 పరుగులుగా మారింది. అయితే ప్రమాదకరంగా మారిన ఈ జోడిని చార్లీ డీన్ విడదీసింది. 13.4 ఓవర్ల వద్ద యాస్తికా రనౌట్ కాగా, అదే ఓవర్ చివరి బంతికి రోడ్రిగ్స్ ఔటైంది. దీంతో 126 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన రిచా ఘోష్ (4), భారతీ ఫల్మాలీ (6) విఫలం కాగా, దీప్తి శర్మ (22: 13 బంతుల్లో 4 ఫోర్లు) ఉన్నంత సేపు దూకుడుగా ఆడింది. అరుంధతీ రెడ్డి (9*), క్రాంతి గౌడ్ (1) పరుగులు చేశారు. ఆ జట్టులో లారెన్ బెల్ 3, ఇస్సీ వాంగ్, టిల్లీ కోర్టీన్, షార్లెట్ డీన్ ఒక్కో వికెట్ తీశారు.

నార్వే చెస్ టోర్నీ.. కార్ల్‌సన్‌కు ప్రజ్ఞ షాక్

గుకేశ్‌కు వరుసగా రెండో ఓటమి

దివ్య హ్యాట్రిక్ విజయాలు

ఓస్లో: నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద సంచలన విజయం నమోదు చేశాడు. ఓపెన్ విభాగం మూడో రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)కు అతను షాకిచ్చాడు. ఇటీవలే సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టైటిల్ గెలిచిన ప్రజ్ఞానంద.. ఇక్కడా ఫామ్ కొనసాగిస్తున్నాడు. ఉత్కంఠగా సాగిన పోరులో ఆఖరికి ప్రజ్ఞదే పైచేయి అయింది. నార్వే చెస్ టోర్నీలో కార్ల్‌సన్‌పై గెలవడం ప్రజ్ఞకు ఇది రెండోసారి. 2024లోనూ అతడు కార్ల్‌సన్‌ను కంగుతినిపించాడు. ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్ ప్రస్తుత టోర్నీ పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతుండడం గమనార్హం. మరోవైపు ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ వరుసగా రెండో పరాజయం చవిచూశాడు. తొలి రెండు గేమ్‌ల్లో గెలిచి ఊపు మీదున్న అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్)తో మొదట డ్రా చేసుకున్నప్పటికీ.. ఆర్మగెడాన్‌లో ఓడిపోయాడు. పట్టికలో ఫిరౌజా (7.5 పాయింట్లు) అగ్రస్థానంలో, ప్రజ్ఞానంద (4.5) రెండో స్థానంలో ఉన్నారు. వెస్లీ సో (4, అమెరికా), గుకేశ్ (3.5), విన్సెంట్ కీమర్ (3, జర్మనీ) కార్ల్‌సన్ (1.5) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. మహిళల విభాగంలో ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ వరుసగా మూడో గేమ్‌లో విజయం సాధించింది. టోర్నమెంట్ టాప్ ప్లేయర్ బిబిసారా అసబాయెవా (కజకిస్థాన్)ను ఆమె ఆర్మగెడాన్‌లో ఓడించింది. కోనేరు హంపి.. ఆర్మగెడాన్‌లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్)కు తలొంచింది. బిబిసారా (5.5), దివ్య (4.5) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతుండగా.. హంపి (2) అట్టడుగున ఉంది.

ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు

దిల్లీ: యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి భారత టీ20 జట్టులో ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అవకాశమిస్తారని సెలక్టర్లను భారత జట్టు మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ ప్రశ్నించాడు. ''వైభవ్ భారత క్రికెట్‌కు దేవుడిచ్చిన బహుమతి. 2026 సూర్యవంశీ ఏడాదిగా గుర్తుండిపోతుంది. అతడు అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు సన్నద్ధంగా ఉన్నాడు. రాబోయే ఇంగ్లాండ్ పర్యటనలో టీ20 సిరీస్‌కు అతణ్ని ఎంపిక చేయాలి. ఈ ఐపీఎల్‌లో గొప్పగా రాణించిన సూర్యవంశీ భారత జట్టులో చోటుకు అర్హుడు. అతడికి ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అవకాశమిస్తారు. 15 ఏళ్లే అయినప్పటికీ.. 15 సంవత్సరాల అంతర్జాతీయ అనుభవమున్న ఆటగాడిలా బౌలర్లపై వైభవ్ విరుచుకుపడుతున్నాడు. అతడు తుది జట్టులో ఉండాలో లేదో తర్వాత నిర్ణయించుకోవచ్చు. మొదట 15 మంది సభ్యుల జట్టులోకి తీసుకోవాలి'' అని గావస్కర్ పేర్కొన్నాడు.

క్వార్టర్స్ లో సింధు, లక్ష్య

సింగపూర్: సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. గురువారం మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్‌స్‌లో సింధు 219, 2112తో రికో గన్‌జి (జపాన్)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో సింధు దూకుడు ముందు రికో నిలవలేకపోయింది. తొలి గేమ్‌ను తేలిగ్గా గెలుచుకున్న భారత అమ్మాయి.. రెండో గేమ్‌లోనూ 189తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. అదే దూకుడుతో ఆమె గేమ్‌తో పాటు మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. క్వార్టర్‌స్‌లో సింధుకు అసలు సవాల్ ఎదురు కానుంది. ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సియంగ్ (కొరియా)తో ఆమె తలపడనుంది. గత ఎనిమిది మ్యాచ్‌ల్లో యంగ్‌పై సింధు ఒక్కసారి కూడా గెలవలేదు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ క్వార్టర్స్ చేరాడు. విదిత్‌సర్న్ (థాయ్‌లాండ్)తో ప్రిక్వార్టర్‌స్‌లో అతడు 20తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి పోటీ నుంచి వైదొలిగాడు. క్వార్టర్‌స్‌లో వతనబె (జపాన్)తో లక్ష్యసేన్ తలపడనున్నాడు. మరోవైపు ప్రణయ్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్‌స్‌లో అతడు 1821, 2116, 1521తో లో కీన్ యీ (సింగపూర్)కు తలొంచాడు. తొలి గేమ్‌లో ఓడినా.. రెండో గేమ్‌లో ప్రణయ్ పుంజుకుని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ 1411తో విజయం దిశగా సాగాడు. కానీ అక్కడ నుంచి అనవసర తప్పిదాలతో ప్రత్యర్థికి అవకాశం ఇచ్చాడు. దీంతో 1414తో స్కోరు సమం చేసిన కీన్ యీ.. అదే జోరుతో గేమ్, మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి జంట క్వార్టర్స్ చేరింది. సాత్విక్ జోడీ 2115, 1121, 2118తో లీ జేహుయ్ యంగ్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జంట 821, 2117, 2116తో యుటాటగూచి (జపాన్) ద్వయంపై గెలిచి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది.

కళ్లన్నీ కుర్రాడి పైనే..

వైభవ్‌ను ఆపితేనే టైటాన్స్‌కు ఛాన్స్

రాజస్థాన్‌తో ఐపీఎల్-19 క్వాలిఫయర్-2 నేడు

ఐపీఎల్-19 ఫైనల్లో ఆర్సీబీని ఢీకొట్టే జట్టేదో నేడు తేలిపోనుంది. క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్‌తో రాజస్థాన్ రాయల్స్ తలపడనుంది. రెండూ బలమైన జట్లే. కానీ లీగ్ దశలో స్థిరమైన ప్రదర్శన చేసినా, క్వాలిఫయర్-1లో చిత్తు కావడం టైటాన్స్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. అయినా ఆ జట్టును తక్కువ అంచనా వేయలేం. మరోవైపు కష్టంగా ప్లేఆఫ్‌స్‌లోకి వచ్చినప్పటికీ ఎలిమినేటర్‌లో అదిరే విజయంతో రాజస్థాన్ జోరు మీదుంది. ఆ జట్టు విధ్వంసక ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపైనే అందరి కళ్లూ ఉన్నాయి. టైటాన్స్ బౌలర్లు అతణ్ని ఆపగలరా లేదా అన్నదానిపైనే ఫలితం ఆధారపడి ఉంది.

ఐపీఎల్ 2026లో ఆసక్తికర పోరుకు వేళైంది. శుక్రవారం జరిగే క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌ను గుజరాత్ టైటాన్స్ ఢీకొంటుంది. తొలి రెండు ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ఏకపక్షమైన నేపథ్యంలో ఈ పోరు ఎలా సాగుతుందో చూడాలి. అందరి దృష్టిమాత్రం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీపైనే. విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రకంపనలు సృష్టిస్తోన్న ఈ బాలుడు ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం. బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తుందని భావిస్తున్న పిచ్‌పై వైభవ్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచే జట్టు.. ఆదివారం జరిగే ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొంటుంది.

రాయల్స్ జోరు కొనసాగేనా..?

టోర్నీని ఘనంగా ఆరంభించి మధ్యలో తడబడ్డ రాజస్థాన్.. గత మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి జోరు మీదుంది. ముఖ్యంగా ఎలిమినేటర్‌లో బలమైన సన్‌రైజర్స్‌ను మట్టికరిపించడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచేదే. రాయల్స్ అతి పెద్ద బలం నిస్సందేహంగా వైభవే. భీకర ఫామ్‌లో ఉన్న ఈ కుర్రాడు ఎలాంటి బౌలింగ్ దళాన్నైనా హడలెత్తిస్తున్నాడు. గత మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై కేవలం 29 బంతుల్లో 12 సిక్స్‌లతో 97 పరుగులు చేసి దాదాపు ఒంటి చేత్తో తన జట్టును గెలిపించాడు. బలమైన బౌలింగ్ విభాగం ఉన్నప్పటికీ వైభవ్‌ను నియంత్రించడం టైటాన్స్‌కు పెద్ద సవాలే. వైభవ్ ఇప్పటివరకు 15 మ్యాచ్‌ల్లో 45.33 సగటు, 242.85 స్ట్రైక్‌రేట్‌తో 680 పరుగులు చేశాడు. అతడు నిలబడ్డాడంటే రాయల్స్‌కు తిరుగుండదు. యశస్వి జైస్వాల్ (426), జురెల్ (508) కూడా రాణిస్తున్నారు. ఈ ముగ్గురితో రాయల్స్ టాప్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. ఫెరీరా (279), రియాన్ పరాగ్ (298) కూడా లయలోనే ఉన్నారు. ఇక బంతితో ఆర్చర్ అదిరే ఫామ్ రాజస్థాన్‌లో ధీమాను పెంచుతోంది. ఇప్పటివరకు అతడు 9.17 ఎకానమీతో 24 వికెట్లు పడగొట్టి రాయల్స్ అత్యుత్తమ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ముఖ్యంగా చివరి లీగ్ మ్యాచ్, ఎలిమినేటర్‌లో అద్భుత బౌలింగ్‌తో రాజస్థాన్ విజయాల్లో కీలక పాత్ర పోషించి జోరు మీదున్నాడు. పేసర్లు బర్గర్ (13 వికెట్లు), బ్రిజేశ్ శర్మ (13).. స్పిన్నర్ యశ్‌రాజ్ పుంజా (9) ఆర్చర్‌కు మద్దతిస్తున్నారు. అయితే బ్యాటింగ్‌లో వైభవ్‌పై, బౌలింగ్‌లో ఆర్చర్‌పై అతిగా ఆధారపడడం రాజస్థాన్‌కు ఎలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి.

గుజరాత్ పుంజుకుంటుందా?

లీగ్ దశలో నిలకడైన ఆటతో టాప్ 2లో నిలిచింది గుజరాత్ టైటాన్స్. చాలా ముందే ప్లేఆఫ్‌స్‌లో స్థానాన్ని ఖరారు చేసుకుంది. కానీ క్వాలిఫయర్ 1లో పేలవ ప్రదర్శనతో ఆర్సీబీ చేతిలో చిత్తు కావడం ఆ జట్టుకు పెద్ద షాకే. బంతితో, బ్యాటుతో తేలిపోయిన ఆ జట్టు 92 పరుగుల తేడాతో ఓడిపోయింది. అయినా టైటాన్స్ బలమైన జట్టే. రాజస్థాన్‌తో పోలిస్తే సమతూకంగా ఉంది. బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్ ఆ జట్టుకు పెద్ద బలం. సాయి సుదర్శన్ (652), శుభ్‌మన్ గిల్ (618), బట్లర్ (498) ఈ టోర్నీలో పరుగుల వరద పారించారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. కానీ వీళ్లపై టైటాన్స్ అతిగా ఆధారపడితోంది. ఈ త్రయం వైఫల్యం క్వాలిఫయర్ 1లో టైటాన్స్‌ను దెబ్బతీసింది. ఈ కీలక సమరంలో వాళ్లు చెలరేగడం ఆ జట్టుకు చాలా ముఖ్యం. లేకపోతే మంచి స్కోరు సాధించడం కష్టమే. ఎందుకంటే లోతైన బ్యాటింగ్ లైనప్ ఆ జట్టుకు లేదు. మిడిల్ ఆర్డర్ బలహీనంగా ఉంది. మొత్తంగా చూస్తే బౌలింగే టైటాన్స్ ప్రధాన బలం అనడంలో సందేహం లేదు. గత మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ ఆ జట్టు బౌలింగ్‌లో ఎంతో నాణ్యత ఉంది. రబాడ 26 వికెట్లతో ఈ లీగ్‌లో అత్యుత్తమ బౌలర్ల జాబితాలో అగ్రస్థానంలో (భువనేశ్వర్‌తో కలిసి) ఉన్నాడు. మరో పేసర్ సిరాజ్ (17 వికెట్లు)తో కలిసి కొత్త బంతితో నిలకడగా వికెట్లు తీస్తున్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ కూడా 15 వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండర్ హోల్డర్ (7.63 ఎకానమీతో 15 వికెట్లు) కూడా రాణిస్తుండడం గుజరాత్‌కు సానుకూలాంశం. మరోవైపు రషీద్ ఖాన్ (19 వికెట్లు) మధ్య ఓవర్లలో ప్రత్యర్థులను కట్టడి చేస్తున్నాడు. అయితే టైటాన్స్ బౌలింగ్‌లో ఎంత పదునున్నా.. వైభవ్‌ను నియంత్రిండానికి ఆ జట్టు బౌలర్లు ఎలాంటి వ్యూహాలతో వస్తారో చూడాలి.

పిచ్.. వాతావరణం.....ముల్లాన్‌పుర్‌లో భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. ఈ సీజన్‌లో ఇక్కడ 220, 223 లక్ష్యాలను జట్లు అలవోకగా ఛేదించాయి. ఈసారి కూడా పిచ్ భిన్నంగా ఏమీ ఉండకపోవచ్చు. ఐపీఎల్‌లో ఇక్కడ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ రాజస్థాన్ నెగ్గింది. టైటాన్స్ ఒకటి గెలిచి, రెండు ఓడింది. మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశముంది. కానీ దాని వల్ల ఆటపై ఎలాంటి ప్రభావం ఉండదు.

73...ముఖాముఖిలో రాజస్థాన్‌పై గుజరాత్‌దే పైచేయి. ఇప్పటివరకు ఈ రెండు జట్లు పదిసార్లు తలపడగా.. టైటాన్స్ ఏడు మ్యాచ్‌ల్లో నెగ్గింది. రాయల్స్ మూడుసార్లే గెలిచింది. 2026లో ఈ జట్లు రెండు సార్లు పోటీపడ్డాయి. ఏప్రిల్ 4న జరిగిన పోరులో రాజస్థాన్ 6 పరుగుల తేడాతో నెగ్గగా.. మే 9 మ్యాచ్‌లో గుజరాత్ 77 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది.

తుది జట్లు (అంచనా) ....గుజరాత్: శుభ్‌మన్ (కెప్టెన్), సుదర్శన్, బట్లర్, నిశాంత్ సింధు, సుందర్, తెవాతియా/సాయికిశోర్, హోల్డర్, రషీద్, రబాడ, సిరాజ్, ప్రసిద్ధ్

రాజస్థాన్: యశస్వి, వైభవ్, జురెల్, పరాగ్ (కెప్టెన్), ఫెరీరా, శానక/సుశాంత్ మిశ్రా, జడేజా, ఆర్చర్, బర్గర్, బ్రిజేశ్, పుంజా.

సచిన్ తెందుల్కర్ .....''వైభవ్ బ్యాట్ స్వింగ్ అదిరిపోయింది. ప్యాడ్ల మీదికి వస్తున్న బంతుల్ని ఇబ్బంది పడకుండా బాదుతున్న వైనం అద్భుతం. అతడికి సంపూర్ణ స్వేచ్ఛనివ్వడం వల్లే ఇలా విధ్వంసం సృష్టించగలుగుతున్నాడు''

యువరాజ్ సింగ్.....''బేబీ బాస్ (వైభవ్).. యూనివర్స్ బాస్ (గేల్) రికార్డును బద్దలుగొట్టాడు. నమ్మశక్యం కాని రీతిలో ఈ పిల్లోడి ఆట సాగుతోంది''

సురేశ్ రైనా..... ''సూర్యవంశీ ఆటను వర్ణించడానికి నిఘంటువులోనూ పదాల్లేవు. అభిమానులు అతడి బ్యాటింగ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండడం.. భారత క్రికెట్ సురక్షితంగానే ఉందని నిరూపిస్తోంది''

ధ్రువ్ జురెల్.... ''వైభవ్‌లో ఉన్న మంచి విషయం ఎంటంటే.. అతడు దేని గురించీ ముందుగా ప్రణాళిక వేసుకోడు. ఎల్లప్పుడూ తనకు తాను మద్దతిచ్చుకుంటాడు. ఇది నేను చేయలేనేమో అనే చిన్న అనుమానం కూడా అతడికి లేదు. బంతిని చూడడం, బాదడమే అతడి పని. బుమ్రా అయినా, కమిన్స్ అయినా అతడికి తేడా ఏమీ ఉండదు''

వీరేంద్ర సెహ్వాగ్.... ''సూర్యవంశీ వేలంలోకి వస్తే ఎలాంటి సంకోచం లేకుండా రూ.30 కోట్లు పెడతాను''